RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 261 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | మంగళవారం, ఏప్రిల్,14, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 261 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Tuesday, April, 14, 2026 | PAGES : 8 RS : 4 /-



ఛత్తీస్‌గఢ్‌లో మరోమారు

## ఎదురు కాల్పులు

**మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్**

రాయ్‌పూర్, ఏప్రిల్13 : ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదు రుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బ హుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీ య సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్యకాల్పులు చోటు చేసుకున్నాయి. అనంతరం రూపీ మృత దేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానం తో విస్తృతంగా గాలింపు కొనసాగుతోం ది. గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే.

డీలిమిటేషన్ పై సీఎం రేవంత్ రెడ్డి..

# కొత్త ఫార్ములా..

**ఏపీకి 38, తెలంగాణకు 30 ఎంపీ సీట్లు!**



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** దేశంలో జరగబోయే లోక్‌సభ నియోజ కవర్గాల పునర్విభజనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సరికొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. జనా భాను కాకుండా, రాష్ట్రాల ఆర్థిక పనితీరును సూచించే స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ) ఆధారం గా ఎంపీ సీట్లను కేటాయించాలని ఆయన సూచిం చారు. ఈ విధానంలో ఆంధ్రప్రదేశ్‌కు 38, తెలంగాణకు 30 లోక్‌సభ స్థానాలు దక్కుతా యని చెప్పారు. జనాభా నియంత్రణ పాటిస్తూ, ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు, కేవలం జనాభా ప్రాతిపదికన పునర్వి భజన జరిగితే రాజకీయంగా నష్టపోతాయనే ఆందోళన చాలాకాలంగాఉ ంది. ఈ నేపథ్యంలో, పనితీరు ఆధారిత కేటాయింపులు ఉండాలనేది సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనలోని ముఖ్య ఉద్దేశం. దీనివల్ల ఉ త్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గకుండా ఉంటుందని ఆయన వర్గం భావిస్తోంది. ఈ కొత్త ఫార్ములా ప్రకారం, తెలంగాణకు ప్రస్తుతమున్న 17 సీట్లకు అదనంగా 13 చేరి మొత్తం 30కి పెరు గుతాయి. ఆంధ్రప్రదేశ్‌కు కూడా 13 సీట్లు అదనంగా వచ్చి 38కి చేరుకుంటాయి.



పుంజుకుంటున్న..


## టీవీకే పార్టీ

చెన్నై : తమిళనాట టీవీకే పార్టీ ఎఫెక్ట్ రెండు ప్రధాన పార్టీలకు గట్టిగానే తగిలేట్టు ఉంది. తొలిసారి బరిలో ఉన్న దళపతి విజయ్‌కు ఏమాత్రం క లిసి వస్తుంది అన్నది అలా ఉంచితే, ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నా డీఎంకేలకు మాత్రం గట్టి దెబ్బ తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. తాజాగా సర్వేలు తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు తప్పదని సూచిస్తున్నాయి.ప్రభుత్వ వ్యతిరేక ఓటు కొత్తగా పార్టీ విజయ్ వైపు వెళితే, అది అన్నాడీఎంకేకు కలిసి రావాలి.. కానీ తమిళనాట అది జరుగుతు ందా అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. దీంతో ఇటు ఏఐడీఎంకే, అటు అధికార డీఎంకే రెండు పార్టీలను గుబులు పట్టుకుంది. చెన్నై మహానగరం లో 16 అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండగా ఇవన్నీ దశాబ్దాలుగా డీఎంకే పార్టీకి కంచుకోటగా ఉంటున్నాయి. చెన్నై తోపాటు తిరువల్లూరు కాం చీపురం చెంగల్పట్టు జిల్లాలో కూడా డీఎంకేకు మంచి పట్టు ఉంది.

నడిచివెళ్తున్న యాత్రికులపైకి

## దూసుకెళ్లిన ట్రక్కు

**ఏడుగురు దుర్మరణం**



రాజ్‌కోట్: ఓ ట్రక్కు అదుపుతప్పి రోడ్డు పక్కన నడుచు కుంటూ వెళ్తున్న యాత్రికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదం లో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. వారిలో ఆరుగు రు యాత్రికులు కాగా.. మరో వ్యక్తి రోడ్డు పక్కన తన వాహనం టైరు మారుస్తున్న డంపర్ డ్రైవర్. యాత్రికులు రాజ్‌కోట్‌లోని గద్కా గ్రామం నుం చి దేకావాలా లోని మహదేవ్ ఆలయానికి వెళ్తుండగా. సోమవారం తెల్లవారు జామున లఖ్తర్-విరామ్‌గామ్ రహదారిపై భాస్కర్‌పారా సమీపంలో ప్రమాదం జరిగింది. రాజ్‌కోట్‌లోని గధ్కా గ్రామం నుంచి దేకావాలాలోని మహాదేవ్ ఆలయానికి నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులు..

# 21వ శతాబ్దం మహిళలదే



**మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోడీ సంచలన వ్యాఖ్యలు**

ఢిల్లీ: 21వ శతాబ్దం మహిళలదే అని, మహిళలు ముం దుండి అభివృద్ధిని నడిపిస్తారని ఆశిస్తున్నట్లు ప్రధాని నరేం ద్రమోడీ పేర్కొన్నారు. మహిళా సాధికారిత లక్ష్యంగా త మ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని చెప్పారు. సోమవా రం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నారీ శక్తి వందన్ కార్యక్ర మం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మోడీ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి ప్రయాణంలో అతి పెద్ద నిర్ణయం తీసుకోబోతున్నామని 21వ శతాబ్ధ ంలో ఇది కీలక నిర్ణయం అన్నారు.

వికసిత భారత్ లక్ష్య సాధనలో

## మినరల్స్ కూడా కీలకమే

**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మినరల్స్ కీలకమని చెప్పుకొచ్చారు. మినరల్ రంగంలో ఆత్మనిర్భ రత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్‌ఐసీసీలో భారత ప్ర భుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసె న్స్ వేలం, 7వ విడత క్రిటికల్ / స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్ర మానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



వైఎస్ వివేకానంద రెడ్డి

## హత్య కేసు

**మరోమారు పిటిషన్ దాఖలు చేసిన సునీత**

హైదరాబాద్,తెలంగాణ దిశ : మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తును కొనసాగిం చేలా కేంద్ర దర్యాప్తు సం స్థకు ఆదేశాలు ఇవ్వాలంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైం ది. ఈ పిటిషన్‌ను వివేకా కూతురు సునీతా రెడ్డి దాఖలు చేశారు.

# ఈ నెల 25న కొత్త పార్టీ ఆవిర్భావం...

## కవిత రాజకీయ భవిష్యత్తు ఆశాజనకమేనా..!?

**హైదరాబాద్, ఏప్రిల్ 13, (తెలంగాణ దిశ):** రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు నాంది పలుకుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ నెల 25న నూతన రాజకీయ పార్టీని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. మేడ్చల్ పరిసరాల్లో జరిగే ఈ భారీ బహిరంగ సభలో పార్టీ పేరు, జెండా, విధానాలను ప్రకటించనున్నట్లు ఆమె ఇప్పటికే వెల్లడించారు. “సర్వోదయ తెలంగాణ” లక్ష్యంగా అన్ని వర్గాల అభ్యున్నతిని సాధించాలనే ధ్యేయంతో ఈ పార్టీ ముందుకు వస్తుందని కవిత స్పష్టం చేశారు. మహిళా నాయకత్వం, యువతకు ప్రాధాన్యత, సామాజిక న్యాయం ప్రధాన అజెండాగా ఉ ండనున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం కవిత భవిష్యత్తు ఆశాజనకంగా కనిపించే అనేక కారణాలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చిన అనుభవం, ప్రజల్లో ఉన్న గుర్తింపు, మహిళా నాయకురాలిగా ప్రత్యేక స్థానం ఆమెకు బలంగా మారుతు న్నాయి. కొత్త పార్టీ ద్వారా ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను నిర్మించగల సామర్థ్యం ఆమెకు ఉ ందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రత్యేకంగా యువత, మహిళలు, సామాజిక వర్గాలను ఆకర్షించే విధంగా స్పష్టమైన అజెండాతో ముందుకు వస్తే రాష్ట్ర రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదగవచ్చునని అంచనా వేస్తున్నారు. భారత రాష్ట్ర సమితి నుండి 2025లో బహిష్కరణ అనంతరం కవిత స్వతంత్ర రాజకీయ దిశగా అడు గులు వేయడం ప్రారంభిం చారు. “జాగృతి జనంబాట” యాత్ర ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకు న్నారు. మేధావులు, సామాజిక సంఘాలతో చర్చలు జరిపి “సామాజిక తెలంగాణ”పై దృష్టి సారించారు. రైతు, యువజన, విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాల నిర్వహించారు. ప్రభుత్వ



విధానాలపై విమర్శలు చేస్తూ ప్రజా సమస్యలను ముందుకు తెచ్చారు. ఈ చర్యల ద్వారా కవిత తనకంటూ ప్రత్యేక రాజకీయ గుర్తింపును ఏర్పాటు చేసుకున్నారని పరిశీలకులు పేర్కొంటున్నారు. కొత్త పార్టీ ఏర్పాటు నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశముంది.
దీనికి తోడు నియోజకవర్గాల పునర్విభజనతో ఎంపీ ఎమ్మెల్యే స్థానాలు పెరగడంతో పాటు మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఏర్పడడం కవితకు కలిసివచ్చే అంశంగా పేర్కొంటు న్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ఢిల్లీ స్థాయిలో పోరాటం కొనసాగించిన కవితకు మహిళల నుంచి స్పందన లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే బిఆర్ఎస్ క్యాడర్‌లోని కొంతమంది తనకు మద్దతుగా ఉ న్నారని కవిత పేర్కొ నడం రాజకీ యంగా ప్రాధాన్యత సంతరిం చుకుంది. అలాగే పాత “టీఆర్ఎ స్” పేరు వినియోగంపై చర్చలు జరుగుతున్నప్పటికీ, ఇది సులభం కాదని నిపుణులు సూచి స్తున్నారు. మొత్తంగా బిఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత స్వతం త్రంగా ప్రజల్లోకి వెళ్లి బలమైన ఆధారం ఏర్పరచుకున్న కవిత, ఇప్పుడు కొత్త పార్టీతో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజా సమస్య లపై నిరంతర పోరాటం, స్పష్టమై న అజెండా, బలమైన కేడర్ నిర్మాణం ఉంటే కవిత రాజకీయ భవిష్యత్తు మరింత ఆశాజనకంగా మారే అవకాశం ఉందని విశ్లేష కులు అభిప్రాయపడుతున్నారు.

# కుషాయిగూడ కోర్టు పరిధిలోకి జవహర్‌నగర్, అల్వాల్ పోలీస్ స్టేషన్‌లు చేర్చాలి

## - పోర్ట్‌ఫోలియో జడ్జితో మల్కాజిగిరి బార్ అసోసియేషన్ సమావేశం

**కుషాయిగూడ, ఏప్రిల్ 13** :జవహర్‌నగర్, అల్వాల్ పోలీస్ స్టేషన్‌లను కుషాయిగూడ కోర్టు పరిధిలోకి చేర్చాలని మల్కాజిగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. రత్తయ్య విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సోమవారం పోర్ట్‌ఫోలియో జడ్జి కె. లక్ష్మణ్ ను కలిసి పలు ముఖ్య సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సమావేశంలో న్యాయవ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధానంగా జవహర్‌నగర్, అల్వాల్ పోలీస్ స్టేషన్‌లను కుషాయిగూడ కోర్టు పరిధిలోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కోర్టు అవసరాల కోసం రెండు ఎకరాల భూమి మార్పిడి, కుషాయిగూడ కోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయడం, నేరేడ్ మేట్‌లో కొత్త కోర్టు భవనం నిర్మాణాన్ని వేగవంతం చేయడం వంటి అంశాలపై చర్చించారు. ప్రస్తుతం అధికార పరిధిలో జవహర్‌నగర్ ప్రాంతం మాత్రమే ఎంఎండీసీ పరిధిలోకి వస్తుండగా, న్యాయపరమైన వ్యవహారాల కోసం మేడ్చల్ కోర్టుకు వెళ్లాల్సి రావడం వల్ల వ్యాజ్యదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జవహర్‌నగర్ నుంచి మేడ్చల్ కోర్టు దూరం సుమారు 19.1 కిలోమీటర్లు కాగా, అల్వాల్ నుంచి 12.9 కిలోమీటర్లు ఉండటం వల్ల ప్రయాణం భారమవుతుందని వివరించారు. అయితే కుషాయిగూడ కోర్టు ఈ రెండు పోలీస్ స్టేషన్‌లకు మరింత సమీపంలో ఉండటం వల్ల కేసులను కుషాయిగూడ కోర్టుకు మార్చడం ద్వారా ప్రజలకు సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు వివరమైన ప్రతిపాదనలు సమర్పించడంతో పాటు వ్యక్తిగతంగా వివరించినట్లు చెప్పారు.కుషాయిగూడ కోర్టులో తగిన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ఈ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు రత్తయ్య పేర్కొన్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని జవహర్‌నగర్, అల్వాల్ పోలీస్ స్టేషన్‌లను కుషాయిగూడ కోర్టు పరిధిలోకి తక్షణం చేర్చేలా ప్రభుత్వం అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని మల్కాజిగిరి బార్ అసోసియేషన్ తరఫున రత్తయ్య విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తావించిన పలు సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఉ




పాధ్యక్షులు హరికృష్ణ, మహిళా ఉపాధ్యక్షురాలు ప్రసన్న, సంయుక్త కార్యదర్శి రవి శంకర్, మహిళా సంయుక్త కార్యదర్శి జలజ, కోశాధికారి పుణ్యరాజు, లైబ్రరీ సెక్రటరీ సాయినాథ్ గౌడ్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా పవన్ కుమార్ బీఎన్, లేడీ రిప్రెజెంటేటివ్ సుజాత, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నవనీత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు బద్రీనాథ్, రాకేష్ ఎన్, నరేందర్, నరేష్, శోభా రాణి, విమల తదితరులు పాల్గొన్నారు.

# నందనవనం కాలనీలో ఘనంగా పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 13, (తెలంగాణ దిశ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి పరిధి నందనవనం కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వర (మరకత లింగం) సహిత పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఆలయ నిర్మాణకర్త చెనమేని మహేష్ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ పరిసరాల్లో జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భౌరంపేటలో రూ.100 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకోవాలి



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 13, (తెలంగాణ దిశ)** :దుండిగల్- గండిమైసమ్మ మండలంలోని భౌరంపేట గ్రామంలో సర్వే నెంబర్ 166/1లో ఉన్న సుమారు 5 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమి అక్రమంగా కబ్జా అవుతున్న భూమిని వెంటనే ప్రభుత్వానికి తిరిగి స్వాధీనం చేయాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి ఫిర్యాదు సమర్పించారు. సదరు భూమి ఔటర్ రింగ్ రోడ్‌కు ఆనుకొని ఉండి దాదాపు రూ.100 కోట్ల విలువ కలిగి ఉంటుందని పేర్కొన్నారు. తప్పుడు ప్రొసీడింగ్స్ ఆధారంగా అక్రమంగా సక్రమం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కలెక్టర్ ప్రొసీడింగ్స్ నం. ఏ1/899/2024 (తేదీ 17-01-2026) చట్టబద్ధతపై సందేహాలు వ్యక్తం చేశారు. ఎక్స్ సర్వీస్ మెన్‌కు కేటాయించినట్లు చూపుతున్న సర్వే నం.166/9లో అసలు భూమి లేకపోయినా, పలు మార్లు అమ్మకాలు జరిపినట్లు ఆరోపించారు. ఇది ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ లాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్ ఫర్స్) చట్టం, 1977కు విరుద్ధమని, వెంటనే ఆ పట్టాలను రద్దు చేయాలని కోరారు. అలాగే తెలంగాణ సర్వే అండ్ బౌండరీస్ చట్టం, 1923 నిబంధనలను ఉల్లంఘిస్తూ సరైన నోటీసులు ఇవ్వకుండా సర్వే నిర్వహించారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని 166/1గా చూపిస్తూ అక్రమంగా ఆక్రమించి, దానిని 166/9/2గా సక్రమం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలు, ఫెన్సింగ్‌ను వెంటనే తొలగించి భూమిని ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదనంగా చట్ట విరుద్ధ భూ ఉపవిభజనలను రద్దు చేయడం, అసైన్డ్ భూముల అక్రమ బదిలీలను నిలిపివేయడం, ప్రభుత్వ భూములను సంరక్షించడం వంటి డిమాండ్లు ఉంచారు. ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని భౌరంపేటలో ప్రభుత్వ పాఠశాల స్థాపనకు భూమి కేటాయించాలని కూడా కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఎమ్మార్వో కార్యాలయం ముందు పెద్దఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఇక కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో రివైజ్డ్ ఎన్వోసీ లేకుండా వాసవి నిర్మాణ సంస్థ నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు ఆరోపిస్తూ, వెంటనే పనులను నిలిపివేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, అరుణ్, ఎల్ల స్వామి, కృష్ణారెడ్డి తదితరులు, భౌరంపేట గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రగతి నగర్‌లో హిందూ మహా సమ్మేళనం ఘన విజయం





**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 13, తెలంగాణ దిశ)** : ప్రగతి నగర్‌లో అయోధ్య రామ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ మహా సమ్మేళనం భక్తిశ్రద్ధల మధ్య దిగ్విజయంగా జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా భారతీయ ఆచారాలు, సంప్రదాయాలు, పూజా విధానాల ప్రాముఖ్యతను విశదీకరించడంతో పాటు ధర్మ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జగదాంబ త్రిశక్తి పీఠం బ్రహ్మశ్రీ బెనారస్ గురూజీ మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో ధర్మాన్ని నిలబెట్టేందుకు మహిళలను, శక్తి స్వరూపిణులను ఆరాధించాలని సూచించారు. అధర్మం పెరుగుతున్న నేపథ్యంలో ధర్మానికి అండగా నిలబడే వారికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. హైకోర్టు న్యాయవాది మౌనిక సుంకర మాట్లాడుతూ సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ విలువలు, పౌరవిధులు, స్వదేశీ వంటి పంచ పరివర్తన అంశాలపై విశదీకరించారు.



చాతుర్వర్ణ వ్యవస్థపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ సమాజంలో ఐక్యత అవసరాన్ని ప్రస్తావించారు. మరో వక్త బీరం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో ఆర్ఎస్ఎస్ పాత్రను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా సేవా కార్యక్రమాల్లో ముందుండే సంస్థగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూచిపూడి, కోలాటం, పేరిణి నృత్యాలు, దుర్గా వాహిని బృందాల శక్తి ప్రదర్శనలు, అగ్ని హోత్రం, బాలల భక్తి గీతాలు, సత్యవోలు రాంబాబు ముక్కుతో శివాజీ చిత్రరచన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలనం నిర్వహించి, అనంతరం వందేమాతరం గేయంతో దేశభక్తిని చాటారు. చివరగా ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి సాంబశివరావు, కోశాధికారి లక్ష్మీ రామారావు, డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, ప్రొఫెసర్ చంద్రమౌళి, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా కాంగ్రెస్ ను మరింత పటిష్ట పరచాలి

## - మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణను మర్యాదపూర్వకంగా కలిసిన మేడ్చల్ నాయకులు





**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 13, (తెలంగాణ దిశ) :** మహిళా కాంగ్రెస్ మేడ్చల్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణను జిల్లా కార్యవర్గ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛాలతో అభినందనలు తెలియజేసి, ఆమె నాయకత్వంలో మహిళా కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ నీలం పద్మ, రాష్ట్ర కార్యదర్శి సుగుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జాజాల రమ్య, కార్యదర్శి లత, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షురాలు మాధవి రెడ్డి, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, ఏ బ్లాక్ అధ్యక్షురాలు వీనస్ మేరీ, మేడ్చల్ మండల అధ్యక్షురాలు చోటు ప్రేమలత పాల్గొన్నారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఏ బ్లాక్ ఉపాధ్యక్షురాలు నాగశరమణి, ఉమ్మడి సుభాష్ నగర్ డివిజన్ మహిళా ప్రధాన కార్యదర్శి దుర్గ ప్రసన్న, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు లలితమ్మ, కూకట్పల్లి నియోజకవర్గ బి బ్లాక్ ఉపాధ్యక్షురాలు కల్పన, బోడుప్పల్ అధ్యక్షురాలు




సమత, 117 డివిజన్ మహిళా అధ్యక్షురాలు జోజమ్మ, తూముకుంట 300 డివిజన్ మహిళా అధ్యక్షురాలు నాగమణి, మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షురాలు పద్మజ తదితరులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా మహిళా నాయకులు పార్టీ బలోపే తానికి కృషి చేస్తామని, రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# మల్కాజిగిరి కార్పొరేషన్‌కు శాశ్వత భవనం

## - రూ.98 కోట్లకు పరిపాలనా అనుమతి
## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శన



**ఉప్పల్, ఏప్రిల్ 13, (తెలంగాణ దిశ)** :ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక అడుగు పడింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు శాశ్వత కార్యాలయ భవనం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 98 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేయడం పట్ల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉప్పల్ భాగయత్ లేఅవుట్ ఫేజ్-IIIలో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆధునిక కార్యాలయ భవనం నిర్మించను న్నట్లు తెలిపారు. ఈ భవనం ద్వారా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు మరింత వేగవంతమైన, సమర్థ వంతమైన పౌరసేవలు అందు బాటులోకి వస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారం వేగవంతం అవుతు ందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఇప్పటికే భవన నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ అధికారులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మరిన్ని ప్రాజెక్టులను తీసుకురావడంలో తాను కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు.



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

METROPOLITAN AREA & URBAN DEVELOPMENT DEPARTMENT Construction of permanent office building for the Malkajgiri Municipal Corporation in the Sy Nos.264, 265, 266, 267, 268, 276, 278, 279 & 280 in Uppal Bhagayath Layout Phase-III - Administrative Sanction - Accord - Approval - Reg.

METROPOLITAN AREA & URBAN DEVELOPMENT (GHMC.1) DEPARTMENT

G.O.Rt.No. 417 Dated: 13-04-2026

Read the following:-

1. G.O.Ms.No. 571, Revenue, dt:14.09.2012.
2. G.O.Ms.No. 292, MA&UD (GHMC-1) Department, dated:24.12.2025.
3. G.O.Ms.No.54/MA&UD (GHMC.1) Dept., dt.10.02.2026.
4. G.O.Ms.No.55/MA&UD (GHMC.1) Dept., dt.11.02.2026.
5. From the Commissioner, MMC, Lr.No.MMC/CE/2025-2026, dt.11.03.2026.

@@@

ORDER:

In the reference 5th read above, the Commissioner, Malkajgiri Municipal Corporation (MMC), Hyderabad has informed that vide G.O.Ms.No.55, MA&UD (GHMC-I) Dept., dt: 11.02.2026, the Government declared and notified Malkajgiri Municipal Corporation comprising Malkajgiri, Uppal and LB Nagar Zones as reorganised in G.O.Ms.No.292, MA&UD (GHMC-1) Department, dated: 24.12.2025. Further, the Government vide G.O.Ms.No.54, MA&UD (GHMC-1) Dept., dt: 10.02.2026 permitted to establish the office at the premises of HMDA Office at Tarnaka.

2. The Commissioner, Malkajgiri Municipal Corporation (MMC), Hyderabad has further informed that the Metropolitan Commissioner, HMDA has considered the allotment of land to an extent of Ac 10-00 Gts in Sy Nos.264, 265, 266, 267, 268, 269, 276, 278, 279 & 280 in Uppal Bhagayath Layout Phase-III for construction of permanent office building for Malkajgiri Municipal Corporation under the provisions of G.O.Ms.No.571, Revenue, dt: 14.09.2012 which was acquired by HMDA. In this regard, a tentative estimate for the construction has been prepared for an amount of Rs.98.00 Cr.

3. The Commissioner, Malkajgiri Municipal Corporation (MMC), Hyderabad has therefore, requested the Government to accord administrative sanction for an amount of Rs.98.00 Crores (Rupees Ninety Eight Crores only) for the work" Construction of permanent office building for the Malkajigiri Municipal Corporation in the Sy Nos. 264,265,266, 267, 268, 269, 276, 278, 279 & 280 in Uppal Bhagayath Layout Phase-III" for the financial year 2025-26 pending approval of the standing committee and General body, MMC and also requested to accord budget under suitable head of account.

4. The Government after careful examination of the matter, hereby accord administrative sanction for an amount of Rs. 98.00 Crores (Rupees Ninety Eight Crores only) for the work" Construction of permanent office building for the Malkajigiri Municipal Corporation in the Sy Nos. 264,265,266, 267, 268, 269, 276, 278, 279 & 280 in Uppal Bhagayath Layout Phase-III" for the financial year 2025-26 and the budget shall be met from the funds of MMC.

5. The Commissioner, Malkajgiri Municipal Corporation, Hyderabad shall take a further necessary action accordingly.

6. This orders issues with the concurrence of the Finance (DCM) Dept., vide their U.O.No.782/110/A2/DCM/2026, dated:13.03.2026.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

JAYESH RANJAN
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

To
The the Commissioner, Malkajgiri Municipal Corporation (MMC), Hyderabad.
OSD to Special Chief Secretary to Government, MA&UD Department.
PS to Secretary to Hon'ble Chief Minister. (MR)
Sc/Sf.

// FORWARDED :: BY ORDER//

SECTION OFFICER

# తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి


## - కాంగ్రెస్ నేత నెమిలి అనిల్ కుమార్





**మల్లాపూర్, ఏప్రిల్ 13, (తెలంగాణ దిశ)** :ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ కోరారు. జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, డీజీఎం వేణుగోపాల్, మల్లాపూర్ ఏఈ రోహిత్‌తో కలిసి కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్, ఆయన బృందం పాల్గొని స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బస్తీబాట కార్యక్రమంలో ప్రజలు వ్యక్తపరిచిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ముఖ్యంగా కేవీల్ రెడ్డి, హెచ్ ఏఎల్ కాలనీ, అన్నపూర్ణ, భవాని నగర్ కాలనీలలో తక్కువ ప్రెషర్‌తో తాగునీటి సరఫరా జరుగుతుందని వివరించారు. దీంతో పాటు ఓల్డ్ మల్లాపూర్‌లో మదీనా చికెన్ సెంటర్ ఎదురుగా కొత్త వాటర్ లైన్ ఏర్పాటు చేసి, కొత్త కనెక్షన్లు కల్పించాలని కోరారు. పలు కాలనీలలో డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే కొత్త డ్రైనేజ్ లైన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా ప్రతిపాదించారు. ఈ అంశాలపై స్పందించిన జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, సమస్యలను అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.
ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నెమలి అనిల్ కుమార్‌ను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ జనరల్ సెక్రటరీ తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోయలకొండ రాజేష్, శంకర్ గౌడ్, పిడిశెట్టి సురేష్, అన్వర్ పఠాన్, సాయి కుమార్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి వారి అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం





**కీసర, ఏప్రిల్ 13, (తెలంగాణ దిశ)** :శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనర సింహస్వామి వారి 18వ వార్షిక అష్టాదశ బ్రహ్మోత్సవాలు ఆలయ ఆనవాయితీ ప్రకారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల మొదటి రోజు సందర్భంగా ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ స్వామివారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. మొదటి రోజు ఉదయం నవ కలశాభిషేకం, విశ్వక్సేన పూజ, అగ్ని ప్రతిష్ఠతో శ్రీ సుదర్శన నరసింహ హోమం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులకు ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేదపండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలతో ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త శ్రీహరి, ఇతర ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# సంపాదకీయం

## ఒకే ఒక్క శాతం మంది దగ్గర 40 శాతం సంపద

దేశఆదాయంలో 58%.. ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది. భారత్‌లోని 40శాతం సంపద అంతా ఒకే ఒక్క శాతంమంది సంపన్నుల వద్ద ఉంది. భారత్‌లో ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు. స్థూల జాతీయాదాయం పెరుగుతున్నప్పటికీ చాలా దేశాల్లో ఆర్థిక అసమానతలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. 2023నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం జనాభా.. ఆదాయ అసమానతలు పెరిగిన దేశాల్లోనే ఉందని పేర్కొంది. 1990తో పోలిస్తే మాత్రం అంతర్జాతీయ జనాభాలో 94శాతం మంది స్థూల జాతీయాదాయం పెరిగిందని తెలిపింది. దేశాల్లో, దేశాల మధ్య అసమానతలను తగ్గించడం ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) పదోది. దాన్ని సాధించడంలో ప్రపంచ పురోగతిని గుర్తించేందుకు ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయం సహా పలుఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాల్లో ఉమ్మడిగా తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. సంబంధిత వివరాలు 'నేచర్ సస్టెయినబిలిటీ' అనేజర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అందులోని వివరాల ప్రకారం..2023 నాటికి ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది.. అసమానతలు తగ్గిన దేశాల్లో నివసిస్తున్నారు. – నాలుగింట ఒక వంతు మంది.. 1990తో పోలిస్తే ఆదాయం, అసమానతలు రెండూ గణనీయంగా పెరిగిన ప్రాంతాల్లో ఉన్నారు. ఉత్తర భారత దేశంలో అసమానతలు స్థిరంగా ఉన్నాయి. దక్షిణ భారత రాష్ట్రాల్లో మాత్రం సమ్మిళిత పురోగతి కనిపించింది. ప్రజారోగ్యం, విద్య, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు పెరగడం, ఆర్థికాభివృద్ధి అందుకు దోహదపడ్డాయి. బ్రెజిల్‌లో పేద కుటుంబాలకు నగదు బదిలీ పథకాలు అసమానతలను తగ్గించేందుకు ఉపకరిస్తున్నాయి పేదలు మరింత పేదరికంలో కూరుకుపోతున్నారు" అన్న వాదన ఎన్నో ఏళ్లుగా ఉంది. ప్రస్తుతం జపాన్‌ను సైతం అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగినప్పటికీ మన దేశంలో ఆర్థిక అసమానతలు ఏ మాత్రం తగ్గడం లేదు.ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత ఆర్థిక అసమానత భారత్‌లో ఉందని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026లో పేర్కొన్నారు. ఆ రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని 40 శాతం సంపద ఒకే ఒక్క శాతం మంది వద్ద ఉంది. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026 అంచనాలను విశ్లేషకులు లుకాస్ చాన్సెల్, రికార్డో గోమెస్ కరెరా, రోవైదా మోష్రిఫ్, థామస్ పికెట్టి ఎడిట్ చేసి, ప్రచురించారు. ఇటీవలి కాలంలో అసమానతలు తగ్గే సూచనలు కనపడకుండాపోయాయని ఆ రిపోర్టు తెలిపింది. భారత్‌లోని అత్యంత సంపన్న 10% వర్గం సుమారు 65% సంపదను పొందుతోందని నివేదిక తెలిపింది. ఆదాయ అసమానలతు కూడా మామూలుగా లేవు. దేశ ఆదాయంలో 58% ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది. కిందిస్థాయిలో ఉన్న50% వర్గం వారికి దేశ ఆదాయంలో కేవలం 15% మాత్రమే దక్కుతోంది. 2014 నుంచి 2024 వరకు దేశంలోని సంపన్న టాప్10% వర్గం, బాటమ్‌లోని 50% వర్గం మధ్య ఆదాయం వ్యత్యాసం స్థిరంగా ఉందని నివేదిక తెలిపింది. అంటే పదేళ్ల క్రితం దేశంలో అసమానతలు ఎలా ఉండేవో ఇప్పుడూ అలానే ఉన్నాయి. భారతదేశంలో సగటు వార్షిక ఆదాయం పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 6,200 యూరోస్, అంటే దాదాపు రూ.6.49 లక్షలు. సగటు సంపద పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 28000 యూరోస్. మహిళల శ్రమ భాగస్వామ్యం 15.7% మాత్రమే ఉందని, గత దశాబ్దంలో పెరుగుదల లేకపోయిందని నివేదిక తెలిపింది. ఇక మొత్తంగా భారతదేశంలో ఆదాయం, సంపద, లింగ పరమైన అసమానతలు అధికంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక విభేదాలుస్పష్టంగా ఉన్నాయని ఇది సూచించింది. 140 కోట్ల జనాభాలో దాదాపు 100 కోట్ల మంది తమ ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు స్థిరమైన ఆదాయంతో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వారు కేవలం 13–14 కోట్ల మంది మాత్రమేనని ఈ అధ్యయనం సూచిస్తోంది. అంటే భారత మార్కెట్‌ను అర్థం చేసుకోవాలంటే కేవలంజనాభా పరంగా కాకుండా,ప్రజల ఆదాయ స్థాయిలను,ఖర్చు విధానాలను విశ్లేషించడం అవసరం. భారత్‌లో ఆర్థిక అసమతుల్యత గణనీయంగా ఉంది. నగరాల్లో ఉన్నత, మధ్య తరగతులకు మంచి ఆదాయ వృద్ధి కనిపిస్తున్నా, గ్రామీణప్రాంతాల్లో ఇంకా తక్కువ ఆదాయ స్థాయిలు కొనసాగుతున్నాయి. ఆదాయ వ్యవస్థ మెరుగుపడకపోతే వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరగదు. దేశంలో చాలా మంది అనిశ్చిత ఉపాధిపై ఆధారపడటంతో, నిర్దిష్ట ఆదాయ స్థాయిని చేరుకోవడం కష్టమవుతోంది. 100 కోట్ల మంది వినియోగదారులు వ్యక్తిగతఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. వీరి ఆదాయం ప్రధానంగా ఆహారం, వైద్యం, విద్య వంటి అవసరాలకే సరిపోతోంది. విలాస వస్తువులు, గృహోపకరణాలు, వినోదం, టూరిజం వంటి విభాగాల్లో వీరు పెద్దగా ఖర్చు చేయడం లేదు. ఈ వాస్తవం మార్కెట్ వ్యూహాలపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. మధ్యతరగతి, ఉన్నత వర్గాలే లక్ష్యం. భారతమార్కెట్‌ను అనేక కంపెనీలు మధ్యతరగతి, ఉన్నత వర్గాలను లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చేశాయి. అయితే,వినియోగ సామర్థ్యం పరంగా చూస్తే, తక్కువ ఆదాయం గల వినియోగదారులు పెద్ద సంఖ్యలో ఉన్నందున, మార్కెట్ వ్యూహాలను పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ప్రీమియం ఉత్పత్తులతో పాటు, బడ్జెట్–ఫ్రెండ్లీ ప్రోడక్ట్స్, స్థిరమైన ధరల వ్యూహాలు, ఫైనాన్స్– ఆధారిత వినియోగ మోడల్స్ ద్వారా ఈ వర్గాన్ని ఆకర్షించే మార్గాలను పరిశీలించాలి. భారత మార్కెట్ వృద్ధి కొనసాగాలంటే కేవలం ఉన్నత ఆదాయ వర్గాలను లక్ష్యంగా పెట్టుకోవడం సరిపోదు. తక్కువ ఆదాయ గల వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని, వారికి అందుబాటులో ఉండే ఉత్పత్తులు, సేవలు రూపొందించాలి. సరసమైన ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి తేవడం, ఈఎంఐ లేదా ఫైనాన్స్ మోడళ్లను ప్రవేశపెట్టడం, గ్రామీణ మార్కెట్లకుచేరువ కావడం ద్వారా వినియోగదారుల స్థాయిని విస్తరించుకోవచ్చు. డిజిటల్ విస్తరణ ద్వారా కూడా ఈ వర్గానికి మార్కెట్‌ను మరింతచేరువ చేయొచ్చు. ఈ మార్గాల్లో వ్యూహాలు అమలు చేస్తే తక్కువ ఆదాయంగల వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరిగి, భారత ఆర్థికవృద్ధికి కొత్త దిశలో ఉత్సాహం లభించవచ్చు. ఆర్థిక అసమతుల్యతను అధిగమించాలంటే ఉపాధి కల్పన సరైన పరిష్కారంగా పరిగణించాలి. ప్రజల ఆదాయాన్ని పెంచేలా.. ప్రభుత్వ కార్యక్రమాలు.. ఉద్యోగ కల్పన పెంచడం, కార్మిక వేతనాలు పెంచడంతోపాటు, స్థిరమైన ఉపాధి అవకాశాలను పెంచడం, వ్యవసాయాన్ని ఆదాయ వృద్ధి మార్గంగా తీర్చిదిద్దేందుకు ఆధునికీకరణ, గోదాములు, ప్రత్యక్ష మార్కెటింగ్ విధానాలు అవసరం. వినియోగదారుల మార్కెట్ విస్తరణపై దృష్టి పెట్టడం అత్యవసరం. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వృద్ధిని సాధించవచ్చు.

# అమెరికాలో జాబ్ మార్కెట్ - తీవ్రమైన ఆందోళనలు!



న్యూయార్క్: అమెరికాలో మాంద్యం ముప్పు పెరుగుతోంది, కాబట్టి అక్కడి కేంద్ర బ్యాంకు యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. అంటే ఇప్పుడు అమెరికాలో రుణాలు తీసుకోవడం మునుపటి కంటే కొంచెం చౌకగా ఉంటుంది. ఈ సంవత్సరం చివరి నాటికి మరో రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని ఫెడరల్ రిజర్వ్ సూచించింది. వాస్తవానికి, అమెరికాలో జాబ్ మార్కెట్ గురించి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయి. కొత్త ఉద్యోగాల కల్పన వేగం నెమ్మదించింది. నిరుద్యోగం పెరిగుతోంది. కాబట్టి, వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా ప్రభుత్వం పెట్టుబడులు, వినియోగాన్ని ప్రోత్సహించాలనుకుంటోంది. రుణాలు, హోమ్ లోన్ల ఇఓఎ తగ్గుతుంది. దీనివల్ల ప్రజల ఖర్చు చేసే సామర్థ్యం పెరుగుతుంది. విదేశీ పెట్టుబడిదారులు మళ్ళీ అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల వైపు మొగ్గు చూపవచ్చు, దీనివల్ల స్టాక్ మార్కెట్లో వృద్ధి ఉండవచ్చు. బంగారం–చమురు వంటి వస్తువుల ధరలలో హెచ్చుతగ్గులు ఉండవచ్చు. ఉద్యోగ సృష్టి మందగించడం, పని గంటలు తగ్గడం, నల్లజాతి కార్మికుల్లో నిరుద్యోగం పెరగడంపై పెరుగుతున్న ఆందోళనల వేళ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాయి టర్స్ పేర్కొంది. ఈ హెచ్చరిక సంకేతాలతో నిర్ణయం తీసుకున్నట్టు ఫెడరల్ రిజర్వ్ చైర్ జెరోమ్ పావెల్ అన్నారు. "ప్రమాదరహిత మార్గాలు లేవు. ఏమి చేయాలో చాలా స్పష్టంగా లేదు" అని పావెల్ వ్యాఖ్యానించారు, ఫెడ్ గరిష్ట ఉపాధి లక్ష్యంతో ద్రవ్యోల్బణ నియంత్రణను సమతుల్యం చేయాలి అని పేర్కొన్నారు. నిరుద్యోగ రేటును స్థిరంగా ఉంచడానికి అవసరమైన స్థాయి కంటే నియామక వేగం పడిపోయిందని పావెల్ అంగీకరించారు. పరిమిత నియామకాలు, తొలగింపులలో స్వల్ప పెరుగుదలతో కలిపి, నిరుద్యోగం త్వరగా మరింత పెరుగుతుందని హెచ్చరించారు. "మైనారిటీ నిరుద్యోగం పెరుగుతుండటాన్ని చూస్తున్నారు. మొత్తం మీద తక్కువ జీతాల ఉద్యోగ సృష్టితో పాటు, మార్జిన్‌లో, కార్మిక మార్కెట్ బలహీనపడుతోందని తెలుస్తోంది. ఇకపై అది మృదువుగా ఉండాల్సిన అవసరం లేదు," అని ఆయన అన్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రేటు తగ్గింపు, ఆర్థిక వ్యవస్థ వృద్ధిని ప్రోత్సహించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రేట్లను మరింత తగ్గించడానికి మార్గం సుగమం చేస్తుందని విశ్లేషకులు తెలిపారు. బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 4 శాతం నుంచి 4.25 శాతం శ్రేణికి తీసుకువచ్చే కోతను ప్రకటిస్తూ, ఈ సంవత్సరం మరో రెండు కోతలు ఉండవచ్చని ఫెడ్ సూచించింది. వడ్డీ రేటు తగ్గింపు, స్వల్పకాలిక మెచ్యూరిటీల కోసం ప్రభుత్వ సెక్యూరిటీల జారీని సమతుల్యం చేయడం ద్వారా కంపెనీలు, సాధారణంగా ఆర్థిక వ్యవస్థకు రుణ ఖర్చులు తగ్గించడం ద్వారా ఆశించిన ప్రభావాన్ని పొందవచ్చని సహ వ్యవస్థాపకుడు విశాల్ గోయెంకా అన్నారు. "ఈ ఆర్థిక సంవత్సరంలో మరిన్ని రేటు కోతల అంచనాతో బాండ్లలో పెట్టుబడి పెట్టడానికి మంచి సమయం" అని ఆయన పేర్కొన్నారు. మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్‌లో గ్లోబల్ ఈక్విటీస్ హెడ్ అరిం దం మండల్ ప్రకారం, ఈఓఓఅ చర్య 25 బేసిస్ పాయింట్ల కోతతో అంచనాలకు అనుగుణంగా ఉంది, అవసరమైతే మిగిలిన సంవత్స రంలో మరో 2 కోతలను సూచిస్తుంది. ఈసంవత్సరం చివరి నాటికి నిరుద్యోగిత రేటు 4.5 శాతానికి చే రుకుంటుందని అంచనా వేస్తున్నందున ఉద్యోగాల సంఖ్య కీలకం. సుంకాలకారణంగా ధరలు స్వల్పకాలంలోపెరుగుతాయని మాత్రమే కాకుండా,ద్రవ్యోల్బణం 2శాతం కంటే ఎక్కువగాఉంటుందని వారు అంచనా వేస్తున్నందున ద్రవ్యోల్బణం ఆధారిత వ్యాఖ్యానం ఆసక్తికరంగా ఉంది, ఇది 2027 వరకు ఫెడ్ లక్ష్య ద్రవ్యోల్బణం. ఇది 7సం వత్సరాల వరుస ద్రవ్యోల్బణం లక్ష్యం కంటే ఎక్కువగా ఉంటుందని సూచిస్తుంది" అని ఆయన వివరించారు.

# ప్రైవేటు మంత్రం!



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** రాష్ట్రానికి కొత్తగా మంజూరైన వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు టిడిపి కూటమి ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తున్న సమయంలోనే, ముఖ్యమైన వైద్య సేవలన్నింటినీ ప్రైవేటీకరించాలంటూ కేంద్రం లిఖిస్తున్న వరుస లేఖలు రాష్ట్ర సర్కార్ భుజాలు చరిచి వత్తాసు పలుకుతున్నాయి. ప్రజల అవసరాలకు తగ్గట్టు వైద్య సేవలను విస్తృతం కావించడానికి ప్రభుత్వం వద్ద తగినన్ని ఆర్థిక వనరుల్లేవు కాబట్టి పిపిపి విధానమే ఏకైక మార్గమన్నది కేంద్ర సర్కార్ ఎత్తుకున్న కుహనా సిద్ధాంతం. దీని అమలుకు 27 పేజీల మార్గదర్శకాలను రాష్ట్రానికి పంపింది. న్యూక్లియర్ మెడిసిన్, సంచార వైద్యం, దంత వైద్యం, రేడియాలజీ సేవలు,కేన్సర్ డే కేర్ సెంటర్ల వంటి వాటికి పిపిపి పద్ధతిని వర్తింపజేయాలని హుకుం జారీ చేసింది. ఎక్విప్–ఆపరేట్– మెయింటైన్ (ఇఒఎం), ఆపరేట్ అండ్ మెయింటైన్ (ఒఅండ్ఎం) మోడ్‌లో సేవల లభ్యతను పెంచాలంది. అంతేనా, ప్రైవేటుకు ఏ రకంగా దోచిపెట్టాలో కూడా గైడ్‌లైన్స్‌లో నిర్దేశించింది. న్యూక్లియర్ మెడిసిన్ సేవల కాంట్రాక్టును 5, 10 ఏళ్లకు ఇవ్వాలంది. చెల్లింపులకూ మార్గదర్శనం చేసింది. ఒక్కో స్కాన్ లెక్కన రెవెన్యూ షేరింగ్, లేదంటే నెల నెలా ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలంది. రాగా పోగా ప్రభుత్వం ప్రజలకు కల్పించాల్సిన వైద్య సేవలు ప్రైవేట్ చేతిల్లోకి వెళతాయి. తొలుత కొంత వరకు ప్రభుత్వం చెల్లింపులు చేసి ఆపై చేతులెత్తేస్తుంది. రోగులందరికీ సేవలు అందవు. చివరికి పేదలు ప్రతి సర్వీస్‌కు ఛార్జీలు భరించాలి. ఇది కచ్చితంగా ప్రభుత్వం ప్రజారోగ్య బాధ్యత నుంచి తప్పించుకోవడమే. ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజి ఉండాలని నీతి ఆయోగ్ పేర్కొనగా, ఆ మేరకు ఎ.పి.కి 17 మెడికల్ కాలేజీలు వస్తే, వాటిలో పదింటిని పూర్తిగా సర్కారీ కాకుండా పిపిపిలో నెలకొల్పుతోంది. అందుకు వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, యువత, విద్యార్థి, సామాజిక కార్యకర్తల నుంచి తీవ్ర నిరసనలు ఎగసిపడుతున్నాయి. పిపిపి వలన వైద్య విద్య మరింత ఖరీదవుతుందని, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం దెబ్బతింటాయని, పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారనే భయాలు అలముకున్నాయి. కళాశాలలకు అనుబంధంగా నడిచే ఆస్పత్రుల్లో వైద్య సేవలకు అధిక మొత్తంలో రోగుల నుంచి ఫీజులు వసూలు చేస్తారన్న ఆందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వమేమో పిపిపి అంటే ప్రైవేటీకరణ కాదని బుకాయిస్తోంది. కాలేజీలలో సీట్లను వేలం వేసి అమ్ముకునేందుకు అవకాశం ఇస్తున్నప్పుడు ఇది ప్రైవేటు కాకుండా ప్రభుత్వరంగం ఎలా అవుతుందో అర్థంకాదు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణే పేదలకు ఇబ్బందని గగ్గోలు పెడుతుండగా, ఇక ముఖ్యమైన సేవలన్నీ ప్రైవేటుపరం అయితే ప్రజల ఆరోగ్యం గాలిలో పెట్టిన దీపం మాదిరే అవుతుంది. కాస్తంత సర్కారీ సేవలు అందుబా టులో ఉన్నప్పుడే కార్పొరేట్ల దోపిడీకి బాధితులు ఆస్తులు అమ్ముకుంటున్నారు. ఆరోగ్యశ్రీ వంటివి ఉన్నా లేనట్లే. కరోనాలో అమెరికా సహా పెద్ద దేశాల్లో వైద్యం కార్పొరేటీకరణ వలన ప్రజలు ఆరోగ్య సేవలందక పడ్డ దయనీయతను చూశాం. ఆ పరిస్థితులు ఇక్కడ లేకపోవడానికి ఒకింత ప్రభుత్వరంగమే కారణం. కాగా కేంద్రం ఆదేశాల మేరకు అన్ని సేవలకు పిపిపి అంటే పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో ఊహకందదు.

నయా–ఉదార విధానాల యుగంలో ప్రపంచంలోని పాలకులు ఉచ్ఛరిస్తున్న తారకమంత్రం పిపిపి. ప్రభుత్వాలు సామాజిక, ప్రజారోగ్యం, సంక్షేమం, మౌలిక వసతులకు నిధులు ఖర్చు చేయవు. వాటన్నింటినీ ప్రైవేట్‌కు అప్పగిస్తాయి. భారీగా పెట్టుబడులు పెట్టిన సంస్థలు ఊరికినే ఉంటాయా? తమ లాభాల వేటలో ప్రభుత్వ అండదండలతో ప్రజల మూలగ పీలుస్తాయి. మోడీ 'వికసిత భారత్' ఇదే. పిపిపి విషయంలో ఎ.పి. అందరికంటే ముందున్నదని టిడిపి కూటమి ప్రభుత్వం, దానికి మద్దతిచ్చే ఆర్థిక మేధావులు, మీడియా డప్పుకొట్టడం వింత అనిపించదు. కేంద్రం ప్రతిపాదించిన పిపిపి ప్రాజెక్టులలో మనవే 30 శాతమని చెప్పడం రాష్ట్రంలో పాలక, ప్రధాన ప్రతిపక్షం కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలను సంపూర్ణంగా బలపరుస్తున్నందున పిపిపి విధానాల అమలుకు మన రాష్ట్రం ప్రయోగశాలగా మారనుంది.

# గ్రీన్ చానల్, అంబులెన్స్, కోసం సిగ్నలింగ్!

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని దష్టిలో పెట్టుకుని... అంబులెన్సులు, అత్యవసర సేవలు, ప్రముఖుల వాహనాల కోసం ప్రత్యేక సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు జీహెచ్ఎం సీ కసరత్తు చేస్తోంది. ఆయా వాహనాలు సిగ్నల్‌కి సమీపింలోకి రాగానే.. ఆటోమేటిక్‌గా గ్రీన్ సిగ్నల్ పడేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఈ నూతన విధానం వల్ల సీఎం, మంత్రులు, గ్రీన్ చానెల్ వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుకోక్కుండా వేగంగా వెళ్లిపోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లకు ఈ నూతన విధానం ఎంతో మేలు చేస్తుందని భావిస్తున్నారు. భాగ్యనగరంలో ట్రాఫిక్ రద్దీ గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. ఉదయం 7 గంటల ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. సీఎం, మంత్రులు వంటి ప్రముఖులు వస్తుంటే.. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను ఆపేసి.. వారికి దారి ఇస్తారు. అదే అంబులె న్స్‌లు వస్తే.. ట్రాఫిక్ వాళ్లు రూట్ క్లియర్ చేయరు.. జనాలు కూడా మాకేంటి.. మేం ముందుగా వెళ్లాలి అన్నట్లు అలానే ఉంటారుమనం చేసే చిన్న ఆలస్యం.. అంబులెన్స్‌లో ఉన్న వారి ప్రాణాలకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. అయితే అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం అనే అంశంపై చాలా మంది వాటికి ప్రత్యేకంగా రోడ్డు లేదా.. సైరన్ సౌండ్ విని.. అవి వెళ్లడానికి అనుమతిస్తే బాగుంటుంద ని అభిప్రాయపడుతుంటారు. ఇక తాజాగా గ్రేటర్ అధికారులు కూడా ఇదే ఆలోచన అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. గ్రీన్ చానల్, అంబులెన్స్ , అత్యవసర సేవలు అలానే ప్రముఖుల వాహనాల కోసం జీహెచ్ఎంసీ అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి కసరత్తు ప్రారంభించింది. ఈ వెహికల్స్ ప్రాధాన్య క్రమంలో మానవ ప్రమేయం లేకుండానే కూడళ్ల వద్ద నిలిచిపోకుం డా.. ముందుకు సాగిపోయేలా సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. త్వరలో ప్రకటించనున్న టెండర్ నోటిఫికేషన్లో ఈ ప్రత్యేక సదుపాయం కల్పించాలని భావిస్తున్నారు. హైదరాబాద్ పరిధిలోని సిగ్నళ్ల నిర్వహణ కాంట్రాక్టు గడువు సెప్టెంబ రు 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సిగ్నళ్ల ఏర్పాటు తో పాటుగా ఉన్న వాటి నిర్వహణ కోసం త్వరలో టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఒక్కో సారి 25 చొప్పున 50 కొత్త సిగ్నళ్లను ఏర్పాటు చేయడమే కాక..

ఇప్పటికే ఉన్న 404 సిగ్నళ్ల నాలుగేళ్ల నిర్వహణకు రూ.70 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పర్యవేక్షణ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటుకు సంబంధించి బుధవారం జీహెచ్ఎంసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 14వ తేదీ వరకు ఆసక్తి ఉన్న సంస్థలు తమ ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నూతన విధానం వల్ల సీఎం, మంత్రులు, గ్రీన్ చానెల్ వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుకోక్కుండా వేగంగా వెళ్లిపోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లకు ఈ నూతన విధానం ఎంతో మేలు చేస్తుందని భావిస్తున్నారు. భాగ్యనగరంలో ట్రాఫిక్ రద్దీ గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. ఉదయం 7 గంటల ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. సీఎం, మంత్రులు వంటి ప్రముఖులు వస్తుంటే.. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను ఆపేసి.. వారికి దారి ఇస్తారు. అదే అంబులెన్స్‌లు వస్తే.. ట్రాఫిక్ వాళ్లు రూట్ క్లియర్ చేయరు..జనాలు కూడామాకేంటి..మేం ముందుగా వెళ్లాలి అన్నట్లు అలానే ఉంటారుమనం చేసే చిన్న ఆలస్యం.. అంబులెన్స్‌లో ఉన్న వారి ప్రాణాలకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. అయితే అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం అనే అంశంపై చాలామంది వాటికి ప్రత్యేకంగా రోడ్డు లేదా.. సైరన్ సౌండ్ విని.. అవి వెళ్లడానికి అనుమతిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతుంటారు. ఇక తాజాగా గ్రేటర్ అధికారులు కూడా ఇదే ఆలోచన అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. గ్రీన్ చానల్, అంబులెన్స్ , అత్యవసర సేవలు అలానే ప్రముఖుల వాహనాల కోసం జీహెచ్ఎంసీ అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి కసరత్తు ప్రారంభించింది. ఈ వెహికల్స్ ప్రాధాన్య క్రమంలో మానవ ప్రమేయం లేకుండానే కూడళ్ల వద్ద నిలిచిపోకుండా.. ముందుకు సాగిపోయేలా సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. త్వరలో ప్రకటించనున్న టెండర్ నోటిఫికేషన్లో ఈ ప్రత్యేక సదుపాయం కల్పించాలని భావిస్తున్నారు. హైదరాబాద్ పరిధిలోని సిగ్నళ్ల నిర్వహణ కాంట్రాక్టు గడువు సెప్టెంబరు 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సిగ్నళ్ల ఏర్పాటుతో పాటుగా ఉన్న వాటి నిర్వహణ కోసం త్వరలో టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఒక్కో సారి 25 చొప్పున 50 కొత్త సిగ్నళ్లను ఏర్పాటు చేయడమే కాక.. ఇప్పటికే ఉన్న 404 సిగ్నళ్ల నాలుగేళ్ల నిర్వహణకు రూ.70 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పర్యవేక్షణ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటుకు సంబంధించి జీహెచ్ఎంసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 14వ తేదీ వరకు ఆసక్తి ఉన్న సంస్థలు తమ ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది. నూతనంగా ప్రవేశపెట్టబోయే సిగ్నలింగ్ వ్యవస్థలో అంబులెన్స్‌లను, అత్యసవర సేవలందించే, ప్రముఖుల కాన్వాయ్ లు వచ్చే సమయంలో గ్రీన్ సిగ్నల్ దానంతట అది పడేలా నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఇందుకోసం ఆయా వాహనం/ వాహనాల నంబర్లు, ఏ మార్గంలో వెళ్తాయన్నదానికి సంబంధించిన సమాచారాన్ని బయలుదేరడానికి ముందే ట్రాఫిక్ పోలీస్ అధికారులకు అందించా లి. అప్పుడు వారుఈ వివరాలను ఐసీసీసీకి పంపుతారు.

# గీతాంజలి ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలలో వైబ్స్ 2026 వార్షికోత్సవ వేడుకలు





**కీసర, ఏప్రిల్ 13, (తెలంగాణ దిశ) :** గీతాంజలి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో వైబ్స్ 2026 వార్షికోత్సవం ఘనంగా ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత, విద్యా ప్రతిభను ప్రతిబింబించే అద్భుత వేదికగా నిలిచింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా డైరెక్టర్ ఆఫ్ ఇంజినీరింగ్, క్వాల్కామ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పి. మురళీ కృష్ణ హాజరై కార్యక్రమానికి విశేష గౌరవాన్ని చేకూర్చారు. అదే విధంగా చైర్మన్ జిఆర్. రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆర్. హరిశ్చంద్ర రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ కుమార్ సుసర్ల, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సాగర్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. బాలాజీ కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా నిలిపారు. ఈ కార్యక్రమం సమగ్ర సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడంలో ఓవరాల్ కోఆర్డినేటర్ డాక్టర్ వి. మధుసూదన్, కన్వీనర్ డాక్టర్ రాధిక డోరా, సహ కన్వీనర్ డాక్టర్ విఎస్. త్రివేణి ముఖ్య పాత్ర పోషించారు. ఈ వేడుకలో సాంస్కృతిక కార్యక్రమాలు, సాంకేతిక విజయాలు మరియు విద్యార్థుల ప్రతిభా పురస్కారాలు ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. ప్రముఖ అతిథుల సందేశాలు విద్యార్థులకు ప్రేరణ నిచ్చాయి. విద్యార్థులు, సిబ్బంది సమన్వయంతో అద్భుతంగా నిర్వహించబడిన ఈ కార్యక్రమం, గీతాంజలి కళాశాల యొక్క ఐక్యత, ఉత్సాహం, ప్రతిభను ప్రతిబింబించింది.

# ఘనంగా "శ్రీ రాజరాజేశ్వర స్వామి (మరకత లింగం) సహిత పంచముఖ ఆంజనేయ స్వామి" విగ్రహ ప్రతిష్టాపన

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 13, (తెలంగాణ దిశ) :**నిజాంపేట్ సర్కిల్ నందనవనం కాలనీలో నూతనంగా నిర్మించనున్న శ్రీ రాజ రాజేశ్వర స్వామి ( మరకత లింగం) సహిత పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో మరకత లింగం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్ పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన దేవాలయంలో మరకత లింగం, పంచముఖి హనుమాన్ స్వామి కృపాకటాక్షాలతో భక్తులందరూ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ నిజాంపేట సర్కిల్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, రవికిరణ్, ఆలయ ఉత్సవ



కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, నందనవనం కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా 'విబ్‌గ్యోర్ 2026' వేడుకలు



**కీసర ఏప్రిల్ 13,(తెలంగాణ దిశ):** గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో వార్షిక దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన 'విబ్‌గ్యోర్ 2026' కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఏప్రిల్ 10, 2026న జరిగిన ఈ వేడుకలు విద్యార్థులు, అధ్యాపకులు, అతిథులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి కళాశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంతో కళకళలాడించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా నిలిచింది ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ప్రత్యక్ష సంగీత ప్రదర్శన. తన ఉత్సాహభరిత గానంతో, ఆకట్టుకునే వేదిక ప్రదర్శనతో ఆయన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. విద్యార్థులు ఆయన పాటలకు అనుగుణంగా కేరింతలు కొడుతూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. అలాగే పృథ్వీ సాయి అందించిన డీజే సంగీత విందు కార్యక్రమానికి మరింత ఊపునిచ్చింది. ఉత్సాహాన్ని రెట్టింపు చేసిన ఈ సంగీతం మధ్య విద్యార్థులు నృత్యాలతో సందడి చేసి కార్యక్రమాన్ని మరింత రంజుగా మార్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విందులు, వినోదాత్మక ప్రదర్శనలతో నిండిన ఈ వేడుకలు కళాశాల విద్యార్థుల్లో ఐక్యత, స్నేహభావం, సృజనాత్మకతను ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ ఈ వేడుకలు చిరస్మరణీయంగా నిలిచాయి. మొత్తానికి 'విబ్‌గ్యోర్ 2026' కార్యక్రమం విజయవంతమైంది. గీతాంజలి కళాశాల సాంస్కృతిక వైభవాన్ని మరోసారి ప్రతిష్ఠాత్మకంగా చాటిచెప్పింది.



# ట్రాఫిక్ సమస్యలకు చెక్




**తిరుపతి,తెలంగాణ దిశ:** తిరుపతి అభివృద్ధికి తగ్గట్టుగానే ట్రాఫిక్ కూడా భారీగా పెరుగుతోంది. స్థానికంగా విస్తరిస్తున్న నగరం, వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి వస్తున్న భక్తుల వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఇబ్బంది పెడుతోంది. అందుకే ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి సిద్ధమవుతోంది తుడా. దీనికి సంబం ధించిన ప్రక్రియను కూడా ప్రారంభించింది.

తిరుపతి అర్బన్ డెవల ప్మెంట్ చైర్మన్ దివాకర్ రెడ్డి అధికారులతో కలిసి తిరుపతిలో పర్యటించారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదించిన ప్రాంతాల్లో తిరిగి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు.

తిరుపతి గ్రామీణ, చంద్రగిరి,రామచంద్రాపురం, రేణిగుంట, వడమాలపేట మండలాల్లో ప్రాంతాలను ఆయన చెక్ చేశారు. దాదాపు90కిలోమీటర్ల మేర ఈ ఔటర్ రింగ్ రోడ్డును ప్రారంభించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రాంతాల్లో సర్వే కూడా ప్రారంభించారు. 2014లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే వైకుంఠ మాల పేరుతో ఈ ఔటర్ రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. అప్పట్లో ఇది ప్రతిపాదన దశలోనే ఆగిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దీనిని పక్కన పెట్టేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరుపతిపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. నగరరూపు రేఖలు మార్చేయాలని చూస్తోంది. అందుకే రోడ్ల అభివృద్ధితోపాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంది. ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న తిరుపతికి భక్తులతోపాటు పర్యాటకులు భారీగా తరలి వస్తుంటారు. వచ్చిన వాళ్లకు ఇబ్బంది లేకుండా ఉండేలా ట్రాఫిక్‌లో సమయం వృథా కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు ప్ర తిపాదన మళ్లీ తెరపైకి తెచ్చింది. ఇది పూర్తి అయితే తిరుపతికి కొత్త కళ వస్తుందని అంటున్నారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. టెండర్లు పిలవనున్నారు.

# నెట్టింట 3డీ కార్టూన్ ఫీవర్!

సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తుంటే.. ఒకదాని తర్వాత ఒకటి 3డీ ముఖాలు, క్యారెక్టర్లు కనిపిస్తున్నాయా? పెద్ద తల, చిలిపి కళ్లతో నవ్వుతున్న ఫొటోలు చూడగానే.. కార్టూన్ సినిమా పోస్టర్‌లా అనిపిస్తున్నాయా? అయితే, మీరు ఇప్పటికే మొదలైన కొత్త ట్రెండ్ జోన్‌లో ఉన్నారు! ఎందుకంటే.. ఇప్పుడు అందరూ తమ సెల్ఫీలను సినిమా లుక్‌లోకి మార్చుకుంటున్నారు. ఆ ట్రాన్స్‌ఫర్మేషన్ వెనుక ఉన్న మాయాజాలం.. గూగుల్ జెమినీ నానో బనానా ప్రో! ఇది ఫొటోను సాధారణ ఫిల్టర్‌లా మార్చదు.. పూర్తిగా కొత్తదానిలా క్రియేట్ చేస్తుంది. అందుకే ఫొటోలోని ముఖం, భావం, లైటింగ్ అన్నీ రియలిస్టిక్‌గా కనిపిస్తాయి. దానికితోడు చిలిపిగా, పిక్సర్ స్టయిల్‌లో ఆకట్టుకుంటాయి. ఇలాంటివే ఇప్పుడు ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ట్రెండ్‌ని ఇప్పటికే పలువురు ఏఐ క్రియేటర్లు ట్రై చేశారు. సింపుల్‌గా.. '3డీ క్యారికేచర్ లుక్‌లో, పెద్ద తలతో, చిలిపి ముఖ కవళికలతో ఫొటో కావాలి' అని ప్రాంప్ట్ చేస్తే సరిపోతుంది. మీకు కావాల్సిన క్యారెక్టర్ మీ కళ్ల ముందు వాలిపోతుంది. ఇందులో ఆశ్చర్యపడి పోవడానికి ఏం లేదు. జెమినీ మోడల్ తన క్రియేటివ్ జీనియస్ ఎప్రోచ్‌తో ఇదంతా చేస్తున్నది. ఫొటోను ఎక్కడా ఎడిట్ చేయదు.. కొత్తగా ప్రొడ్యూస్ చేసి ఇస్తుంది. మాటలతో, ఎమోషన్‌తో, బ్యాక్‌డ్రాప్‌తో అన్నీ మీరు కోరినట్టుగా ఇచ్చేస్తుంది. ఉదాహరణకు.. 'పారిస్ సన్‌సెట్‌లో నా 3డీ ఫొటో కావాలి' అని చెబితే.. ఆ సన్నివేశం,



ఆ లైటింగ్ అన్నిటినీ ఫొటోలో జొప్పిస్తుంది. ఫొటో డీటెయిల్స్, వెబ్ డేటా అన్నిటినీ కలిపి.. నిజంగా జీవం ఉన్న ఫొటోని సృష్టిస్తుంది. అన్నీ కలిపి నిజంగా మీరే అనిపించేలా, ఫిల్మీ లుక్‌లో మెరిసే క్యారికేచర్‌గా మారిపోతుంది. ఈ ఫీచర్ ప్రత్యేకత ఏమిటంటే.. యూజర్ తన ఇమేజ్ టోన్‌ని మాటలతోనే కంట్రోల్ చేయొచ్చు. కాన్ఫిడెంట్‌గా స్మైలింగ్/ డ్రామాటిక్ లైటింగ్ లాంటి పదాలు వాడితే.. అదే మూడ్‌కి తగ్గట్టుగా ఏఐ ఫొటోని తయారు చేస్తుంది. అందుకే ఈ ట్రెండ్ ఇప్పుడు యూత్‌లో బాగా పాపులర్ అయింది. వాళ్లకి ఇది ఫన్, క్రియేటివ్ అవుట్‌లెట్ కూడా. 'నా ఫొటోను కూడా ఇలా మార్చితే ఎలా ఉంటుంది?' అని మీకూ అనిపిస్తున్నదా!? అయితే వెంటనే ట్రై చేసేయండి.


# ఫస్ట్ టూ ట్వల్త్...ఒక్కటేబోర్డు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణ పాఠశాల విద్యలో అతిపెద్ద మార్పులు రానున్నాయి. ఇప్పటిదాకా పదో తరగతి వరకు ఉన్న ఎస్ఎస్‌సీ బోర్డు, ఇంటర్ వరకు ఉన్న ఇంటర్మీడియట్ బోర్డు రెండు కలిసి పోనున్నాయి. ఈ మేరకు 1 నుంచి 12వ తరగతి వరకు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటు చేయనుంది ప్రభుత్వం. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047లో ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న సెకండరీ స్కూల్ సర్టిఫికేట్, ఇంటర్మీడియట్ బోర్డులను ఒకే అధికారంతో భర్తీ చేయడం ద్వారా తెలంగాణ తన పాఠశాల విద్యా వ్యవస్థను పునర్నిర్మించనుంది. కొత్త బోర్డు అన్ని వర్గాల పాఠశాలలకు విద్యా ప్రమాణాలు, నాణ్యతా నిబంధనలు, గుర్తింపును నిర్వహిస్తుందని ప్రభుత్వం తెలిపింది. డ్యూయల్-బోర్డు వ్యవస్థ నుండి వైదొలగాలని కేంద్రం రాష్ట్రాలకు చెబుతోంది.ప్రాథమిక, యూపీఎస్, ఉన్నత పాఠశాలలు వంటి ఒకే ప్రాంతంలో పనిచేసే పాఠశాలలు ఒకే ప్రధానోపాధ్యాయుడి కింద ఒకే సంస్థలో విలీనం అవుతాయి. ఈ ఏకీకృత పాఠశాలలు అన్నమాట ప్రీ-ప్రైమరీ నుండి 10వ తరగతి వరకు తరగతులను అందిస్తాయి. హైస్కూల్‌గా మారుతుంది. విలీనం ముందు విద్యార్థులకు తగిన ప్రత్యామ్నాయాలు అందిస్తారు. దీని ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతుంది. ఒకే ప్రాంతం, ఒతే ప్రదేశంలో ఉన్న వివిధ పాఠశాలలు ఒకే గొడుగు కిందకు వస్తాయి.ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో దశలవారీగా ప్రీ-ప్రై మరీ తరగతులను ప్రవేశపెడుతుంది. సరిపడా ఉపాధ్యాయులను కూడా అందిస్తుంది. కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్, వయస్సుకు తగిన ఏఐ అక్షరాస్యతతో పాటు పాఠశాల స్థాయి నుండి వృత్తి విద్యను ఏకీకృతం చేయాలని రాష్ట్రం యోచిస్తోంది. పరీక్షా వ్యవస్థ, అభ్యాస అంచనా పద్ధతులను కూడా పునఃరూపకల్పన చేస్తారు.విద్యా ప్రమాణాలను నియంత్రించడానికి తెలంగాణ స్కూల్ స్టాండర్డ్స్ అథారిటీ ఏర్పాటు చేస్తారు. విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తిని చూస్తారు. దీని ఆధారంగా అవసరమైన చోట ఉపాధ్యాయులను పోస్ట్ చేస్తారు. జిల్లా, మండల స్థాయి సమీక్షలు ప్రతి సంవత్సరం ఉంటాయి. టెక్నాలజీ ద్వారా ట్రాన్స్‌ఫర్ రిపోర్ట్ తయారు అవుతుంది.

నియామ కాలు కోర్ సబ్జెక్టులు, ఆర్ట్స్, శారీరక విద్య, కౌన్సెలింగ్ వంటి అనుబంధ రంగాలను కవర్ చేస్తాయి. పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా పీహెచ్‌డీ అర్హత ఉంటే.. వారిని ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ కళాశాలల లో కూడా నియమించవచ్చు. ప్రభుత్వ ఆఎఖ కళాశాలలను కొత్త ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులు, ఇన్-సర్వీస్ సిబ్బంది కోసం కోర్సులను అందించే విద్యా కేంద్రాలుగా మారుస్తారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నెట్‌వర్క్‌లను ప్రభుత్వం మరింత క్రియాశీలకంగా చేయనుంది. దీనిద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టి పెడుతుంది.

# అంతరిక్షంలో కమర్షియల్ హోటల్..



న్యూఢిల్లీ: స్పేస్ టూరిజం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నది. దీనికి మరింత ఊపు తెచ్చేందుకు కాలిఫోర్నియాలోని స్పేస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అద్భుత ప్రణాళిక రచించింది. ప్రపంచంలోనే మొదటిసారిగా అంతరిక్షంలో కమర్షియల్ హోటల్‌ను నిర్మించేందుకు సిద్ధమైంది. రెస్టారెంట్లు, జిమ్‌లు, సినిమా హాళ్లు వంటి విలాస వసతులు ఉండే ఈ హోటల్ నిర్మాణాన్ని వచ్చే ఏడాదే ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. 2027కల్లా దీన్ని అందుబాటులోకి తీసుకురానున్నది. ఈ హోటల్‌ను వాయేజర్ స్టేషన్‌గా పిలుస్తున్నారు. ఇది రింగ్ డిజైన్‌లో ఉంటుంది. సుమారు 1,25,000 చదరపు అడుగుల్లో ఒకదానికొకటి కలుపుతూ 24 మాడ్యూల్స్ ఉంటాయి. ఇందులో 280 మంది అతిథులు, 112 మంది సిబ్బంది ఉండొచ్చు. హైఎండ్ రిసార్ట్ తరహాలో ఇందులో వసతులు కల్పిస్తున్నారు. రెస్టారెంట్లు, బార్లు. సినిమా, కాన్సర్ట్ హాళు ,, జిమ్,రిక్రియేషన్ సెంటర్. ప్రైవేట్ సూట్స్, రెసిడెన్షియల్ విల్లాలు. భూమిని వీక్షించేలా లాంజ్‌లు స్పేస్ ట్రిప్‌కి ఎంత ఖర్చవుతుంది? కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఇక్కడికి పర్యాటకులను పంపవచ్చు. అయితే ఈ హోటల్ ట్రిప్‌కు ఎంత ఖర్చవుతుందన్నది

# ఏపీలో స్మార్ట్ రేషన్ కార్డు

**ఏలూరు,తెలంగాణ దిశ:** ఏపీలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రజలకు సులభంగా, పారదర్శకంగా రేషన్ అందించేందు కు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అక్రమార్కులకు చెక్ పెట్టాలని భావిస్తోంది. ఆగస్టు నుంచి వీటిని పంపిణీ చేస్తోంది ఏపీ. ఇప్పటికే చాలా వరకు పంపిణీ చేసింది.గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులకు అప్పగించే బాధ్యతను ఇచ్చింది. అంతేకాదు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టుకుంది. అయితే చాలా మంది లబ్ధిదారులు ఇంకా వాటిని తీసుకోలేదు. వేలాది కార్డులు పంపిణీ చేయలేదు. వాటిని కమిషనరేట్‌కు పంపనున్నారు. గడువు దగ్గరకు వచ్చినా.. సరే అర్హులైన కొందరు స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోలేదు. ఇంకా చాలా కార్డులు పంపిణీ కోసం ఎదురుచూస్తున్నాయి. కొందరికి కార్డులు తీసుకోవాలని సమాచారం ఇస్తున్నా స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు.

# అధిక యూరియా.. భూమికి చేటు

## కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు



**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** రైతుల్లో అధిక యూరియా మరియు రసాయనిక ఎరువుల వినియోగం వల్ల వ్యవసాయ భూము లపై ఏర్పడుతున్న దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ఒక అవగాహన కార్యక్రమంను కమాన్ పూర్ మండలంలోని లింగాల గ్రామము, కామాన్ పూర్ మండలం లో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం రామగిరిఖిల్ల వారు నిర్వహించారు. ఈసందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం మరియు మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ మాట్లాడుతూ, అవసరానికి మించి యూరియా, రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూసారము తగ్గిపోవడం, పోషక లోపాలు ఏర్పడటం, పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా పంటలు పడిపోవడం, పురుగులు-తెగుళ్ల తీవ్రత పెరగడం, సాగు వ్యయం అధికమవడం వంటి సమస్యలు రైతులను ఆర్థికంగా నష్టపరుస్తున్నాయని వివరించారు. ఈ సమస్యలకు పరిష్కారంగా పచ్చి ఎరువుల (గ్రీన్ మాన్యూరింగ్)వినియోగాన్ని విస్తృతంగా చేపట్టాలని సూచించారు. సున్నంపప్పు, దైన్చా, సనంపు వంటి పచ్చి ఎరువు పంటలను సాగు చేయడం ద్వారా మట్టిలో సేంద్రియ పదార్థం పెరిగి, నేల నిర్మాణం మెరుగుపడుతుందని తెలిపారు. దీని వల్ల రసాయనిక ఎరువులపై ఆధారపడకుండానే భూసారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. అదేవిధంగాభూసార పరీక్షల (సాయిల్ టెస్టింగ్) ప్రాధాన్యతను నిపుణులు ప్రత్యేకంగా వివరించారు. భూమిలో ఉన్న పోషక స్థాయిలను తెలుసుకుని, పంట అవసరానికి తగిన మోతాదులోనే ఎరువులు వాడటం వల్ల అధిక వినియోగాన్ని నివారించవచ్చని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయడం ద్వారా దిగుబడులు మెరుగుపడతాయని అన్నారు. యూరియాను విడతలుగా (స్ప్లిట్ అప్లికేషన్) పంట దశలకు అనుగుణంగా వేయాలని రైతులకు సూచించారు. ఒకేసారి ఎక్కువ మోతాదులో యూరియా వేయడం వల్ల పోషకాలు వృథా అవుతాయని, విడతలుగా వేస్తే పోషకాల వినియోగ సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. మొత్తంగా సేంద్రియ ఎరువులు, పచ్చి ఎరువులు, భూసార పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం వంటి పద్ధతులు పాటిస్తే వ్యవసాయం సుస్థిరంగా సాగుతుందని, భవిష్యత్తు తరాలకు సారవంతమైన నేలను అందించవచ్చని ఈ అవగాహన కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ పిల్లి, డాక్టర్ వినోద్ కుమార్ మరియు కామాన్ పూర్ మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ , లింగాల వ్యవసాయ విస్తరణ అధికారి, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు



## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ :** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ సంకీర్త్ తో కలిసి రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, రవాణా, టీజీఎండీసీ తదితర శాఖల అధికారులతో ఇసుక అక్రమ రవాణాపై చేపట్టాల్సిన చర్యలపై సమీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గతంలో మాన్యువల్ కూపన్ల ద్వారా ఉచితంగా ఇసుక అందించామని, ఇకపై ఆ విధానాన్ని పూర్తిగా నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇకపై జిల్లాలో ఇసుక అవసరమైన లబ్ధిదారులు తప్పనిసరిగా “మన ఇసుక వాహనం” యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా ఇసుక పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.

త్వరలోనే తహసీల్దార్లు, టీజీఎండీసీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయి లో ఉన్న సమస్యలపై విశ్లేషణ చేస్తామని అన్నారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లను గుర్తించేందుకు ఇరిగేషన్, టీజీఎండీసీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్ట్ అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టి ఓవర్‌లోడింగ్‌లను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలించినా, అక్రమ డంపులు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవని తెలిపారు.

పోలీసులతో కలిసి నిరంతరం తనిఖీలు చేపడతామని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. ఇసుక రీచ్‌లు, వాగుల నుంచి ఇసుక తరలించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని, అక్రమ ఇసుక రవాణా చేస్తే వాహనంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, రవాణా అధికారి సంధాని, ఆర్డీఓ హరి కృష్ణ, ఇరిగేషన్ శాఖ ఈఈ బసవ ప్రసాద్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ ప్లాను విస్తరణ..?



## ఔటర్ రింగురోడ్డు వరకూ రాజధాని రోడ్లు మధ్య ప్రాంతం మొత్తంలో ప్లానింగు

**అమరావతి,తెలంగాణ దిశ:** అమరావతి రాజధాని విస్తరణలో భాగంగా రెండోదశ పూలింగు ప్రక్రియ ప్రారంభించిన సిఆర్‌డిఏ త్వరలో మాస్టర్‌ప్లానునూ విస్తరించనున్నట్లు తెలిసింది. పూలింగు ప్రక్రియ ముగిసిన అనంతరం ప్లానింగు విస్తరణకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించనున్నారు. 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి ఔటర్ రింగురోడ్డుకు ఇప్పటికే గెజిట్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనికితోడు ఇన్నర్ రింగురోడ్డు నిర్మాణమూ చేపట్టనున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లానును విస్తరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ఇటీవల మంత్రి నారాయణ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న రోడ్లను రెండోదశ పూలింగు ప్రాంతానికి విస్తరించనున్నామని, వీటిని ఔటర్ రింగుకు అన్నివైపులా కలిపేలా ప్లానింగు ఉందనీ పేర్కొన్నారు. దీని ప్రకారం తూర్పున 16వ నెంబరు జాతీయ రహదారి హద్దుగా దక్షిణం, పడమర ప్రాంతంలో ఔటర్ రింగురోడ్డు, ఉత్తరాన కృష్ణానది ప్రాంతం మధ్యలో పూర్తిగా ప్లానింగు ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. దాదాపుగా సిఆర్‌డిఏ రీజియన్ ప్రాంతం మొత్తం సమగ్ర ప్లానింగు పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం సిఆర్‌డిఏ ప్రాంతం సుమారు 8352 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. అంటే సుమారుగా 20.88 లక్షల ఎకరాలకు విస్తరించి ఉంది. దీనిలో కనీసం మూడు లక్షల ఎకరాల పరిధిలోకి రాజధాని ప్లానింగు ఏరియా పెరుగుతుందనేది అంచనాగా వేస్తున్నారు. ప్రస్తుతం 16వ నెంబరు జాతీయ రహదారికి ఈ3, ఈ5 రోడ్లను కలపనున్నారు. ఈ3 రోడ్డును రెండోదశ ల్యాండ్ పూలింగు ఏరియాకూ తీసుకెళతారు. ప్రస్తుతం రెండోదశ పూలింగు ఏరియాలో రోడ్ నెట్‌వర్కు ఏర్పాటు అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పనిలో పనిగా మొత్తం ఔటర్‌రింగురోడ్డుకూ అనుసంధానం చేయనున్నారు.

2017లోనే కార్యాచరణ: రింగురోడ్ల మధ్యలో ప్లానింగు ఏర్పాటు చేయాలనే అంశంపై 2017 మార్చిలో జరిగిన సిఆర్‌డిఏ అథారిటీ సమావేశంలోనే నిర్ణయించారు. ఇన్నర్ రింగురోడ్డు, ఔటర్ రింగురోడ్డుకు మధ్యలో అభివృద్ధికి అవసరమైన ప్లానింగు చేయాలని అప్పట్లో సిఎం అధికారులకు సూచించారు. దీనికి వీలుగా రాజధాని చుట్టుపక్కల ఏడు ప్రాంతాలను పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలుగా గుర్తించారు. రింగురోడ్లను కూడా వాటిని దృష్టిలో పెట్టుకునే ప్లాను చేశారు. గుడివాడ, గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, కంచికచర్ల, కంకిపాడు, ఉయ్యూరు పరిసరాల్లో ప్రత్యేక అభివృద్ధి కేంద్రాలనూ ఏర్పాటు చేయాలనేది అప్పటి ప్రతిపాదన. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా గుడివాడ, ఆహ్లాద, పర్యాటక ప్రాంతంగా తెనాలి, లాజిస్టిక్ కేంద్రంగా గన్నవరం ప్రాంతాలను అప్పట్లో ప్రతిపాదించారు. ప్రస్తుతం మాస్టర్‌ప్లాను రూపొందించాలనే మంత్రి ప్రకటన నేపథ్యంలో ఈ వ్యవహారం మరలా చర్చనీయాంశం అయింది.

## భారీగా పెరిగిన మిర్చి ధరలు

**గుంటూరు,తెలంగాణ దిశ :**గుంటూరు మిర్చి యార్డులో ధరలు భారీగా పెరిగాయి. యార్డుకు కొత్త సరుకు రావడం, ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గి దిగుబడులు కూడా తగ్గుతాయన్న సమాచారంతో వ్యాపారులు కొత్త సరుకు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కర్నూలు, కడప, అనంతపురం నుంచి మిర్చి బస్తాలు వస్తున్నాయి. గత నెలలో క్వింటాళ్‌కు రూ.3 వేలు పెరగా ఈనెల మొదటి వారం నుంచి ధరలు మరింత పెరిగాయి. గత రెండు నెలల క్రితం ఉన్న ధరల కంటే కనీసం క్వింటాళ్‌కు రూ.5 వేల పెరిగాయి. యార్డుకు 44,140 బస్తాలు సరుకు రాగా పాత నిల్వలతో కలిపి 50,136 బస్తాలు అమ్ముడుపోయాయి. ఇంకా 7,187 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఎసి కామన్ వెరైటీల్లో గరిష్ట ధర క్వింటాళ్ రూ.20 వేలు, కనిష్ట ధర రూ.13 వేలు లభిస్తుంది. తేజ, బాడిగ వెరయిటీ కూడా ఇదే ధరలు వస్తున్నాయి. ఆర్మూర్ రకం కనిష్ట ధర రూ.12 వేలు, గరిష్టంగా రూ.14 వేలు ధర వచ్చింది. గతేడాది సరుకు కోల్డ్ పస్టోరేజిల్లో నిల్వ ఉంది. ఈ సరుకు కూడా ధరలు పెరిగాయి.

# భారతి సిమెంట్స్‌పై గురి!




**ఒంగోలు,తెలంగాణ దిశ:** ఏదైనా చెబితే హేతుబద్ధత ఉండాలి. అబద్ధం చెప్పినా నమ్మినట్టు ఉండాలి. కానీ ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి తరచూ ఫెయిల్ అవుతున్నారు. ఇటీవల మీడియా ముందుకు వచ్చి మళ్లీ అమరావతి పై లేనిపోని మాటలు మాట్లాడారు. ఇప్పుడిప్పుడే జగన్ విషయాన్నీ మరిచిపోతున్న అమరావతి రైతులను మళ్లీ కెలికారు. నది గర్భంలో అమరావతిని కడుతున్నారు అంటూ నిందలేశారు. అయితే రెండో విడత భూసేకరణకు దిగుతున్న ప్రభుత్వంపై అమరావతి రైతులు అసంతృప్తితో ఉన్నారు. జగన్ ఆ మాటలు అనేసరికి వారంతా తమ అసంతృప్తి తగ్గించుకున్నారు. తమ శాశ్వత శత్రువు జగన్మోహన్ రెడ్డి అని బలంగా నమ్మడం ప్రారంభించారు. డామిట్ కథ అడ్డం తిరిగింది అంటూ సజ్జల రామకృష్ణారెడ్డి ఎంట్రీ ఇచ్చారు. జగన్ మాటలను వక్రీకరించారని సంజాయిషి ఇవ్వడం ప్రారంభించారు. అమరావతి తో వదల్లేదు జగన్. ఏపీ నుంచి పరిశ్రమలు వెళ్లిపోతున్నాయని కూడా వ్యాఖ్యానించారు. అందులో భారతి సిమెంట్స్ గురించి ప్రస్తావించారు ఇప్పుడు అందరూ ఆశ్చర్యపోతున్నారు.జగన్ అధికారంలో ఉన్నప్పుడు చాలా కంపెనీలు పెట్టుబడుల పేరుతో ఏపీలో ఆస్తులు ఆక్రమించుకుంటాయి. జగన్ అధికారంలో లేకపోతే వాటి దగ్గర పెట్టుబడులకు డబ్బులు ఉండవు. అయితే పారిపోయిన పరిశ్రమల జాబితాలో జగన్మోహన్ రెడ్డి భారతి సిమెంట్స్ ను చేర్చడం చాలామంది ఆశ్చర్యానికి కారణం అయింది. ప్రభుత్వం వేధిస్తున్నందున తమ సంస్థను కూడా తరలిస్తామని జగన్ చెబుతున్నారు. అయితే ప్రభుత్వం అక్రమంగా ఆయన కేటాయింపు చేసుకున్న భూముల లీజు విషయంలో నోటీసులు మాత్రమే ఇచ్చింది. దానిని వేధింపులుగా భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. జగన్ అధికారంలో ఉన్నప్పుడే తన కుటుంబ సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా వేల కోట్ల రూపాయల విలువైన గనులను కట్టబెట్టారు. భారతి సిమెంట్స్ కు కేటాయించిన లీజుల్లో నిబంధనలను ఉల్లంఘించారని తేలడంతో.. కూటమి ప్రభుత్వం ఆ లీజులను రద్దు చేసేందుకు సిద్ధపడింది. దానిని పరిశ్రమలను తరిమివేయడం అంటారా?అసలు భారతి సిమెంట్స్ ఏర్పాటు అక్రమమని ఆరోపణలు ఉన్నాయి.. భారతి సిమెంట్స్ అసలు పేరు అది కాదు. రఘురాం సిమెంట్స్. 2004లో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత.. ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ఆ కంపెనీని కొనుగోలు చేశారు. రఘురాం సిమెంట్స్ కంపెనీకి సున్నపురాయి లీజులు ఉన్నాయి. భారతి సిమెంట్స్ గా మారిన తర్వాత ఆ లీజులను ఆ కంపెనీ వాడుకుంది. ఇటువంటి పరిస్థితుల్లో గనుల విషయంలో కేంద్రం స్పష్టమైన పాలసీని తీసుకొచ్చింది.

ఓ కంపెనీ పేరుతో లీజులు తీసుకొని.. మరో కంపెనీ టేక్ ఓవర్ చేస్తే లీజులు చెల్లవు అని స్పష్టం చేసింది. 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వం రఘురాం సిమెంట్స్కు ఇచ్చిన ప్రాథమిక అనుమతిని కూడా రద్దు చేసింది. 2019లో ఏపీలో అధికారం మారిన తర్వాత సీన్ చేంజ్ అయింది. కొన్ని రకాల న్యాయపరమైన అంశాలను తెరపైకి తెస్తూ లీజులను పునరుద్ధరించుకున్నారు. అయితే హైకోర్టు ఈ విషయంలో కొన్ని రకాల సూచనలు చేసిన పట్టించుకోలేదు. సరిగ్గా 2024 ఎన్నికలకు ముందు లీజులను పునరుద్ధరిస్తూ జీవోలు జారీచేశారు. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు వెళ్ళింది. విచారణ చేయాలని రాష్ట్రానికి కేంద్రం లేఖ రాసింది. దీంతో అసలు విషయం బయటపడింది. రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంతో పరిశ్రమలను తరిమేస్తున్నారన్న ప్రచారం మొదలుపెట్టారు జగన్.

# చంద్రబాబుకు తలనొప్పిగా సొంత మనుషులు!



**విజయవాడ,తెలంగాణ దిశ :** చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు సొంతసామాజికవర్గంలోనే శత్రువులు ఎక్కువయ్యారు. ప్రత్యర్థులు చేసేవిమర్శలను పెద్దగా పట్టించుకోవాల్సిన పనిలేదు. కానీ సొంత సామాజికవర్గం నేతలే చంద్రబాబు ప్రతి నిర్ణయాన్ని తప్పుపడుతుండటం ఆయనకు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతుందనే చెప్పాలి. ఒకరకంగా చంద్రబాబు నాయుడుకు బయట శత్రువులతో కంటే ఇంట్లో శత్రువులతో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఈసారి కనిపిస్తుంది. ప్రధానంగా ఈసారి మాత్రం కమ్మ సామాజికవర్గం నేతలు మాత్రమే ఆయనను రాజకీయంగా ఇరకాటంలోకి నెడుతున్నారని చెప్పాలి. అందులో ప్రధానంగా వద్దే శోభనాద్రీశ్వరరావు, ఏబీ వెంకటేశ్వరరావు, ముప్పవరపు వెంకయ్య నాయుడులు ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు ఇబ్బందికరంగా మారాయి. వద్దే శోభనాద్రీశ్వరరావు మాజీ టీడీపీ నేత. చంద్రబాబు మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు రాజకీయంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితేనేం రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. చంద్రబాబు వ్యతిరేక మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా వద్దే ఇంటర్వ్యూలతో చెలరేగిపోతున్నారు. చంద్రబాబు రాజధాని పేరిట రైతులను నిలువునా ముంచుతున్నారంటూ వద్దే శోభనాద్రీశ్వరరావు పదే పదే వ్యాఖ్యానిస్తున్నారు. తొలిదఫా ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చిన రైతులు ఇబ్బందులను చూసైనా రెండో విడత భూ సమీకరణకు సహకరించవద్దంటూ రైతులకు వద్దే శోభనాద్రీశ్వరరావు పిలుపు నిస్తున్నారు.

పచ్చని పంటలు పండే భూములను సర్వనాశనం చేస్తున్నారని, కలల్లో చంద్రబాబు విహరిస్తున్నారని ఫైర్ అవుతున్నారు. మరో ఎయిర్ పోర్టు, మరో ఆరులేన్ల రహదారి అవసరమా? అని ప్రశ్నిస్తున్నారు. ఇక ఏబీ వెంకటేశ్వరరావు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇంటలిజెన్స్ చీఫ్ గా పనిచేశారు. తర్వాత పదవీ విరమణ చేశా రు. కానీ ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద పదవి వస్తుందని ఏబీ వెంకటేశ్వరరావు భావించారు. పోలీసు కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమించారు. దానిని తీసుకునేందుకు ఏబీ వెంకటేశ్వరరావు ఇష్టపడలేదు. పైగా రాష్ట్రంలో కొత్త పార్టీ పెడతానని చెబుతున్నారు. అలాగే యాభై వేల ఎకరాలు తొలి విడత సేకరించిన భూమిని ఎవరెవరికిచ్చారో లెక్కలు చెప్పాలంటూ ఏబీ వెంకటేశ్వరరావు మీడియా ద్వారా నిలదీస్తున్నారు. ఇది కూడా చంద్రబాబుకు ఇబ్బందికరమే. ఇక మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఇటీవల మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను తప్పుపట్టేలా మాట్లాడటం కూడా బాబు సర్కార్ ను ట్రబుల్ లోకి నెట్టింది. విద్య, వైద్యం మాత్రం ఉచితంగా పేదలకు అందించాలని, మిగిలిన పథకాలను రద్దు చేయాలంటూ వెంకయ్య నాయుడు చేసిన వ్యాఖ్యలు జగన్ తో పాటు చంద్రబాబుకు కూడా తగిలినప్పటికీ ఎక్కువ డ్యామేజీ చంద్రబాబుకే నంటున్నారు. అలా ఈ ముగ్గురు చేస్తున్న వ్యాఖ్యలు చంద్రబాబుకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి

# బ్లింకిట్ 10 నిమిషాల డెలివరీ ఎత్తివేత!

## అదే బాటలో స్విగ్గీ, జెప్టో గిగ్‌వర్కర్ల సమ్మెతో దిగివస్తున్న సంస్థలు




న్యూఢిల్లీ : గిగ్‌వర్కర్ల సమ్మెతో ఇకామర్స్, క్విక్ కామర్స్ సంస్థలు ఒక్కో అడుగు దిగివస్తున్నాయి. ఇటీవల కొన్ని ప్రోత్సాహాలకు ముందుకు రాగా .. తాజాగా అత్యంత కీలకమైన 10 నిమిషాల్లో క్విక్ డెలివరీ విధానానికి గుడ్‌బై చెబుతున్నాయి. క్విక్ డెలివరీపై గిగ్‌వర్కర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు పలుమార్లు ఆందోళన చేయడంతో జమాటోకు చెందిన బ్లింకిట్ 10 నిమిషాల్లో డెలివరీ నిబంధనను ఎత్తివేసిందని తెలుస్తోంది. ‘పది నిమిషాలలో పది వేలకు పైగా ఉత్పత్తుల డెలివరీ’ అనే ట్యాగ్‌లైన్‌ను సవరించి ‘మీ ఇంటికే 30 వేలకు పైగా ఉత్పత్తుల సరఫరా’గా బ్లింకిట్ మార్చేసింది. అంటే ఆర్డర్ చేసిన ఉత్పత్తుల సరఫరాకు ఇక నిర్దిష్ట కాలపరిమితి ఉండదన్న మాట. క్విక్ కామర్స్ సంస్థలకు, కార్మిక మంత్రిత్వ శాఖకు మధ్య జరిగిన చర్చల ఫలితంగా బ్లింకిట్ ఈ నిర్ణయం తీసుకుంది.

ఉత్పత్తుల డెలివరీకి కాలపరిమితి విధించడంతో గిగ్ వర్కర్లపై ఒత్తిడి పెరుగుతోందని మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. డెలివరీ భాగస్వాములకు సురక్షితమైన పని పరిస్థితులు, మెరుగైన భద్రత కల్పించాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరింది. స్విగ్గీ, జెప్టో వంటి ఇతర క్విక్ కామర్స్ సంస్థలు కూడా బ్లింకిట్ బాట పట్టే అవకాశం ఉన్నదని పిటిఐ వార్తా సంస్థ తెలిపింది.

ఈ రెండు సంస్థలు కూడా ఉత్పత్తుల డెలివరీకి కాలపరిమితిని నిర్ణయించాయి. గత సంవత్సరం డిసెంబర్ 25, 31న గిగ్ వర్కర్లు డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్త సమ్మె జరిపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా వారు పది నిమిషాల డెలివరీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. రైడర్ల ఆరోగ్యం, రోడ్డు భద్రత, ఆదాయం వంటి అంశాలకు సంబంధించి వ్యక్తమవుతున్న ఆందోళనలను ఈ సమ్మె ముందుకు తెచ్చింది. సమ్మెకు కార్మిక సంఘాలు కూడా మద్దతు తెలిపాయి.

## పడిపోయిన టమోటా ధరలు

**మదనపల్లె,తెలంగాణ దిశ :**మదనపల్లెలో కిలో టమోటా రూ.25కు పడిపోయాయి. మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌కు 90 మెట్రిక్ టన్నుల టమోటా మాత్రమే వచ్చాయి. వాటిలో పది కిలోల మొదటి రకం టమోటాలు రూ.250, రెండో రకం రూ.230, మూడో రకం రూ.200లతో వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేశారని మార్కెట్ సెక్రటరీ జగదీష్ తెలిపారు. పదిరోజుల క్రితం కిలో టమోట రూ.50 పలుకగా, రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పతనం కావడంతో కనీసం పంటలు వేసేందుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా రావడం లేదని,ధరలు ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేయకుండా మానేయడమే మేలని రైతులు అంటున్నారు. మార్కెట్ యార్డులో ధరలు పతనం కాగా బహిరంగ మార్కెట్‌లో మాత్రం టమోటా ధరలు అకాశాన్నంటుతుండడంతో వినియోగదారులు బేంబేలెత్తుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మొదటి రకం కిలో టమోటా రూ.50 పలుకుతుండడం గమనార్హం.

# ఇరాన్ అశాంతికి బయటి శక్తుల ఆజ్యం




ఇరాన్ ఆధునిక చరిత్రలోనే అత్యంత తీవ్రమైన సంక్షోభాల్లో ఒకదాన్ని ఎదుర్కొంటోంది. ఆర్థిక కష్టాలపై ప్రారంభమైన నిరసనలు దేశవ్యాప్తం గా విస్తరించి, సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖామెనీ అధికారానికి నిరంతర సవాలుగా మారింది. హింస పెరుగుతున్న వేళ, ఉరిశిక్షల బెదిరింపులు, దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ నిలిపివేత, అలాగే ముఖ్యంగా అమెరికా వంటి విదేశీ శక్తుల జోక్యంతో ఇరాన్ అంతర్గత కలకలిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. మానవ హక్కుల సంస్థలు పరిస్థితులు వేగంగా క్షీణిస్తున్నాయని హెచ్చరిస్తున్నాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి అగెస్ కాలమార్డ్, నిరసనలను అణిచివేయడానికి "త్వరిత విచారణలు, యాదచ్ఛిక ఉరిశిక్షలు" మళ్లీ ఉపయోగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2022లో జరిగిన ఉమెన్, లైఫ్, ఫ్రీడం ఉద్యమం తరువాత చోటుచేసుకున్న సామూహిక ఉరిశిక్షలను ఆమె గుర్తు చేశారు. దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ బ్లాక్‌ఔట్ కారణంగా హత్యలు, అరెస్టుల నిజమైన పరిమా ణాన్ని నిర్ధారించడం అసాధ్యంగా మారింది. అశాంతి వ్యాప్తి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఇరాన్‌లోని 31 ప్రావిన్సులన్నింటిలోనూ నిరసనలు చెలరేగాయి. 180కు పైగా నగరాల్లో వందలాది ప్రదర్శన లు నమోదయ్యాయి. ఇటీవలి వారాల్లో కనీసం 850 మంది మరణిం చారని, 2,300 మందికి పైగా అరెస్టయ్యారని హక్కుల సంఘాలు అంచనా వేస్తున్నాయి. బ్లాక్‌ఔట్ వల్ల కుటుంబాలు పరస్పరం సంబం ధాలు కోల్పోయాయి. ఇదంతా జరుగుతుండగానే భద్రతా బలగాలు తమ దమన చర్యలను మరింత కఠినతరం చేశాయి. తాజా నిరసనలకు కారణం ఆర్థిక పతనం. ఇరానియన్ రియాల్ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది. ద్రవ్యోల్బణం సుమారు 40 శాతానికి చేరింది. ఆహారం, ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రోల్ ధరల పెంపు, చాలా వస్తువులపై సబ్సిడీ మారకపు రేట్ల రద్దు ఇవన్నీ అనేక కుటుంబాలను అంచుల దాకా నెట్టాయి. అయితే నిరసనలు త్వరలోనే ఆర్థిక అంశాలను దాటి, రాజకీయ దమనంపై ఉన్న కోపాన్ని ప్రతిబింబించాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘర్షణాత్మక ధోరణి అవలంభించారు. నిరసనలు కొనసాగించాలని ఇరానీయులను ప్రోత్సహిస్తూ, నిరసనకారులకు ఉరిశిక్షలు అమలు చేస్తే "తీవ్ర చర్యలు" తీసుకుంటామని తెహ్రాన్‌కు హెచ్చరించారు.

ఇరాన్‌లో "గెలవాలి" అనేదే తన లక్ష్యమని ట్రంప్ చెప్పారు, వేగవంతమైన, బలప్రయోగాత్మక చర్యల సంకేతాలిచ్చారు. అయితే ఇవి మధ్యప్రాచ్యంపై అమెరికా దష్టిని తగ్గించాలని, ఇతర దేశాలపై రాజకీయ మార్పులు రుద్దకూడదని చెప్పిన కొద్ది వారాల క్రితమే విడుదలైన వాషింగ్టన్ జాతీయ భద్రతా వ్యూహానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. సెనేటర్ బెర్నీ శాండర్స్, అమెరికా సైనిక జోక్యం ఘోరమైన తప్పిదమని హెచ్చరిస్తూ, గత జోక్యాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. హింసాత్మక దమనాన్ని ఆపాలని, ఇంటర్నెట్‌ను పునరుద్ధరించాలని, స్వేచ్ఛాయుత ఎన్నికలకు మద్దతు ఇవ్వాలని వాషింగ్టన్ కోరాలని ఆయన అభిప్రాయం. బాహ్య ఒత్తిడి ముఖ్యంగా సైనిక బెదిరింపులు తాము సహాయపడాలనుకునే ప్రజలకే నష్టం చేస్తాయన్న విస్తత ఆందోళనను ఇది ప్రతిబింబిస్తుంది.

# పడిపోతున్న ఇరాన్ కరెన్సీ..



న్యూఢిల్లీ, ,: ఇరాన్ ఆర్థిక వ్యవస్థ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. ఆర్థిక సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతోంది. దేశ కరెన్సీ రియాల్ విలువ పతనం ఆగడం లేదు. దీంతో ప్రజలు పెరిగిన నిత్యావసర ధరతో ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక డాలర్ విలువ ఇరాన్‌లో 14 లక్షల రియాల్‌కు చేరింది. దీంతో సామాన్యులు రోజువారీ అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి నెలకొంది. భారత రూపాయితో పోల్చితే, కేవలం రూ. 90తో 14 లక్షల రియాల్స్ పొందవచ్చు. గత డిసెంబర్‌లో సెంట్రల్ బ్యాంక్ అధ్యక్షుడు మొహమ్మద్ రెజా ఫార్జిన్ రాజీనామా చేశారు. గత జూన్‌లో ఇజ్రాయిల్‌తోప్రారంభమైన యుద్ధం ఇరాన్ పతనాన్ని వేగవంతం చేసింది. అమెరికా న్యూక్లియర్ సైట్లపై దాడులు, ఐకేయరాష్ట్ర సమితి ఆంక్షలు ఆర్థికాన్ని కుంగదీశాయి. 2018లో ట్రంప్ పాలిసీతో జిల్లెడిన ఆయిల్ ఎగుమతులు, విదేశీ ముద్ర లభ్యతతగ్గడం సమస్యలనుమరింత తీవ్రతరం చేశాయి. 1979 విప్లవ సమయంలో డాలర్ విలువ 70 రియాల్స్‌కు సమానంగా ఉండేది. 2026 ప్రారంభంలో 14 లక్షలకు చేరింది. 40 ఏళ్లలో విలువ 20,000 రెట్లు పడిపోయింది. 2025లో మాత్రమే 45 శాతం క్షీణత. బంక్ డబ్బులు కరిగిపోతాయని భయపడి పౌరులు డాలర్లు, బంగారు కొనుగోళ్లకు దూకుతున్నారు. డిసెంబర్‌లో తెహ్రాన్ గ్రాండ్ బజార్ వ్యాపారులు ధరల పెరుగుదలతో ఇబ్బంది పడ్డారు. రియాల్ పతనంతో రుణాలు పెరిగి, విద్యార్థులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జొమ్హౌరి అవెన్యూలో ప్రారంభమైన ఇది ఇప్పుడు అయతోల్లా అలీ ఖమేనీ నేతృత్వంలోని ఇస్లామిక్ రిపబ్లిక్‌పై పోరుగా మారింది. 2022లో మహ్సా అమినీ మరణం తర్వాతి అల్లర్లు ఇప్పటి అగ్నిపర్వతాన్ని పెంచాయి. ఇరాన్ సంక్షోభం భారత్‌పైనా ప్రభావం పడే అవకావం ఉంది. మన దేశం గతేడాది 1.24 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేసింది. 0.44 బిలియన్ డాలర్ల ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 1.68 బిలియన్ డాలర్లు. భారత కరెన్సీలో రూ. 15 వేల కోట్లకుపైనే. ఆర్థిక సంక్షోభం కారణంగా ఎగుతులు నిలిచిపోయే ప్రమాదం ఉంది.

# సంక్షేమం సరే.. ప్రజాసమస్యలు సంగతేంటీ..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో ప్రస్తుతం సంక్షేమం వర్సెస్ అభివృద్ధి అనే అంశం హాట్ టాపిక్ గా మారుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన ఆరు గ్యారెంటీల అమలుకు పెద్దపీట వేసింది. 2025-26 బడ్జెట్‌లో ఏకంగా రూ. 56,000 కోట్లను కేవలం ఈ గ్యారెంటీల కోసమే కేటాయించడం ప్రభుత్వ ప్రాధాన్యతలను స్పష్టం చేస్తోంది. అయితే, ప్రజలను నేరుగా ఆకట్టు కునే నగదు బదిలీ, ఉచిత పథకాలపై పెడుతున్న దృష్టి, రాష్ట్ర భవిష్యత్తు కు కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనపై తగ్గిపోతోందనే విమర్శ లు వినిపిస్తున్నాయి. రోడ్ల మరమ్మతులు, మురుగునీటి పారుదల వంటి ప్రాథమిక పనులు కూడా నిధుల లేమితో అగిపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణం అవుతోంది. ముఖ్యంగా గతంలో ఆర్భాటంగా ప్రకటించి శంకుస్థాపనలు చేసిన పలు ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగో చరంగా మారింది. ఉదాహరణకు, ఓటూ రెండో దశ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా ఇవ్వాల్సిన సుమారు రూ. 381 కోట్లు విడుదల చేయకపోవడంతో ఆ ప్రాజెక్టు పట్టాలెక్కడం లేదు. అదేవిధంగా, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధుల బకాయిలు పెరిగిపోవడం వల్ల పనులు మందగించాయి. కేవలం రైల్వేలే కాకుండా, సాగునీటి రంగంలో అత్యంత కీలకమైన దేవాదుల వంటి ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా 2025 నాటికి పూర్తి కావాల్సిన గడువును దాటి 2027కు వాయిదా పడ్డాయి. ప్రభుత్వ వ్యూహం ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, పేదలకు తక్షణ ఊరటనివ్వడం చుట్టూ తిరుగుతోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి వంటి పథకాలు లబ్ధిదారులకు మేలు చేస్తున్నా.. దీర్ఘకాలికంగా ఆదాయాన్ని సృష్టించే మౌలిక సదుపాయాల కల్పన అటకెక్కడం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వ కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపా యల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో, కొత్త పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీనివల్ల గ్రామాలు, పట్టణాల్లో చిన్న చిన్న అభివృద్ధి పనులు సైతం నిలిచిపోయి, ప్రజలు రోజువారీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ , రీజినల్ రింగ్ రోడ్ వంటి భారీ ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో భూసేకరణ సవాళ్లు, నిధుల సమీకరణ పెద్ద అడ్డంకు లుగా మారాయి. ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం వంటి అత్యవసర ప్రాజెక్టుల విషయంలో శంకుస్థాపన చేసినా, అసలు పనులు ప్రారంభం కావడానికి నెలల తరబడి సమయం పడుతోంది. ఆరోగ్య, విద్యా రంగాల్లో మౌలిక వసతుల లేమిపై నిరసనలు వ్యక్తమవుతున్నా యి. ఆరు గ్యారెంటీల అమలు కోసం చేస్తున్న అప్పులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే అవకాశం ఉండటంతో, భవిష్యత్తులో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం మరింత కష్టతరం కానుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కేవలం సంక్షేమ పథకాలతోనే ఓటర్లను మెప్పించవచ్చని భావించడం ప్రభుత్వానికి రాజకీయంగా రిస్క్ తో కూడుకున్న వ్యవహారమే. ఎందుకంటే, ప్రజలు పథకాలతో పాటు మెరుగైన రోడ్లు, సాగునీరు, మౌలిక సదుపాయాలను కూడా కోరుకుం టారు. నిధులన్నీ పథకాలకే మళ్లిస్తూ, కంటికి కనిపించే అభివృద్ధిని విస్మరించడం వల్ల మధ్యతరగతి, పట్టణ ఓటర్లలో వ్యతిరేకత మొదలవుతోంది. సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సరైన సమతుల్యత పాటించకపోతే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలంగాణలో కుల రాజకీయాలు సాధ్యమేనా..?

**కరీంనగర్,తెలంగాణ దిశ :** జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రెండు పడవలపై కాళ్లు పెట్టకూడదు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి తో అధికారంలోకి వచ్చిన పవన్ కల్యాణ్ తెలంగాణలోనూ పార్టీని విస్తరించాలని భావిస్తున్నట్లు కనపడుతుంది. ఇటీవల కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం పర్యటనలో భాగంగా ఒక రిసార్ట్ లో తెలంగాణ జనసేన నేతలు, కార్యకర్తలతో పవన్ కల్యాణ్ సమావేశ మయ్యారు. అయితే పవన్ కల్యాణ్ ను అభిమానించే వారు తెలంగాణ లోలేరని కాదు. అది సినిమా హీరోగానే అభిమానించే వాళ్లు. అంతే తప్ప రాజకీయంగా ఆయనను ఓన్ చేసుకునే వారు దాదాపుగా లేరనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు,తెలంగాణ పాలిటిక్స్ కు చాలా తేడా ఉంది. ఇక్కడ కుల రాజకీయాలు అస్సలు పనిచేయవు. అలాగే సెంటిమెంట్ బాగా పనిచేస్తుంది. గతంలో జరిగిన అనేక ఎన్నికలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. అందుకే వైసీపీ తెలంగాణ లో దుకాణం మూసేసింది. తన పార్టీని ఆంధ్రప్రదేశ్ కు మాత్రమే పరిమితం చేసింది. అసలు జగన్ తెలంగాణ రాజకీయాల్లో వేలు కూడా పెట్టడం లేదు. ఇక కూటమిలో తన మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ కూడా దాదాపు అదే బాటలో పయనిస్తుంది. తెలంగాణలో టీడీపీ ఇంతవరకూ రాష్ట్ర కమిటీని కూడా ఏర్పాటు చేయలేదు. జగన్, చంద్రబాబును చూసినట్లుగానే పవన్ కల్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ వాసిగానే తెలంగాణ ప్రజలు చూస్తారు. అంతే తప్ప తండోపతండాలుగా వచ్చి ఓట్లు గుమ్మరించే సీన్ మాత్రం లేదనే చెప్పాలి. అందుకే ఆంధ్రప్రదేశ్ లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకుంటే మంచిది. పార్టీ పెట్టి ఇన్నేళ్లయినా ఆంధ్రప్రదేశ్ లోని అన్ని నియోజకవర్గాల్లో జనసేన లేదు. ఇది వాస్తవం. అలాంటిది తెలంగాణలో రాజకీయం చేసి చేతులు కాల్చు కోవడంతప్ప మిగిలేది ఏమీ ఉండదన్నకామెంట్స్ వినపడుతున్నా యి. బహుశబీజేపీతో పొత్తుపెట్టుకున్నప్పటికీ ఇక్కడపెద్దగా రాజకీ యంగా ఒరిగేది లేదు. వచ్చేది లేదు. అందుకే ముందు ఆంధ్రప్రదేశ్ లో పార్టీపై ఫోకస్ పెట్టి వచ్చే ఎన్నికల్లో మరిన్ని సీట్లు గెలిచి ముఖ్య మంత్రి పదవికి దగ్గర దారి ఏర్పరుచుకుంటే మంచిదన్న సూచనలు పవన్ కల్యాణ్ కు కొందరు సోషల్ మీడియా వేదికగా చెబుతున్నారు. మరి పవన్ చెవికి ఈ మాటలు ఎక్కుతాయో? లేదో? చూడాలి.


# యూపీఐ ద్వారా పీఎఫ్ విత్‌డ్రా!

## బ్యాంకు ఏటీఎంల ద్వారా నగదు ఉపసంహరణ ఏప్రిల్‌నాటికి అందుబాటులోకి




న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులు తమ ఈపీఎఫ్‌ను యూపీఐ పేమెంట్ గేట్‌వే ద్వారా నేరుగా తమ బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసుకునే అవకాశం ఏప్రిల్ నాటికి అందుబాటులోకి వస్తుంది. ఈపీఎఫ్‌లో కొంత నిష్పత్తిలో సొమ్మును మినహాయించి, అత్యధిక సొమ్ము ను చందాదారులకు అందుబా టులో ఉంచేందుకు, ఆ సొమ్మును యూపీఐ విధానంలో తమ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయడానికి వీలు కల్పించే ప్రాజెక్టును కార్మిక మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేస్తున్నది. ఈపీఎఫ్‌వోతో అనుసం ధానం చేసిన బ్యాంక్ ఖాతాకు బదిలీ చేయడానికి అందుబాటులో ఉన్న అర్హత గల ఈపీఎఫ్ బ్యాలన్స్‌ను చందాదారులు తెలుసుకోగలు గుతారు. అనుసంధానం చేసిన యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) పిన్‌ను ఉపయోగించి, లావాదేవీని పూర్తి చేయవచ్చు. దీని వల్ల ఈపీఎఫ్‌వో చందాదారుల బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ము సురక్షితంగా బదిలీ అవుతుంది. ఆ సొమ్మును బ్యాంకు ఏటీఎంల ద్వారా తీసుకోవచ్చు. ఈ విధానం సజావుగా అమలయ్యేందుకు సాఫ్ట్‌వేర్ సమస్యలను పరిష్క రించే ప్రయత్నంలో ఈపీఎఫ్‌వో ఉంది.

# భాగ్యనగరం.. వామ్మో.. కాలుష్యం...!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** పరిశ్రమలు నగరమంతటా చెల్లాచెదు రుగావిస్తరించి ఉన్నాయి. ఇది వ్యవస్థీకృత పరిశ్రమల జోనింగ్ సూత్రాలను ఉల్లంఘిస్తోంది. నగర విస్తరణ సమయంలో శాస్త్రీ య విశ్లేషణలు, పౌర సంప్రదింపులు ఎక్కువగా లేకపోయాయి. ఒకప్పుడు హైదరా బాద్‌లో మూసారాంబాగ్ వంటి చారిత్రక 'బాగ్‌లు', అనేక చెరువులు ఉండేవి. కానీ అవి కనుమరుగవడం గాలి నాణ్యతపై నే రుగా ప్రభావం చూపింది. ప్రజా రవాణా ఇప్పటికీ విశ్వసనీయంగా లేకపోవడం, అం దుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు వ్యక్తిగత వాహనాలపై ఆధారపడాల్సి రావడం మరో ప్రధాన కారణం. 'హైదరాబాద్‌లో ఇప్పుడు ద్విచక్ర, త్రిచక్ర వాహనాల సాంద్రత అత్యధికంగా ఉంది. ఏటా లక్షల సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి, దీనివల్ల ఉద్గారాలు గణనీయం గా పెరుగుతున్నాయ'ని ఒక పౌరుడు తెలిపారు. ప్రణాళిక లేని పరిశ్రమల అభివృద్ధి, ముఖ్యంగా రసాయన, ఔషధ పరిశ్రమలు, కాలుష్య భారాన్ని మరింత పెంచుతూ హైదరాబాద్ గాలిని రసాయనపరంగా మరింత విషపూరి తంగా మారుస్తున్నాయి. కాలుష్యానికి మరో ప్రధాన కారణం హైదరాబాద్‌లో శాస్త్రీయ పట్టణ ఘన వ్యర్థాల నిర్వహణ లేకపోవడమే. 'చెత్తను తరచుగా కాల్చడం లేదా రోడ్ల వక్కన వదేయడం జరుగుతోంది. భారీ చెత్త కొండలు ఏర్పడి, జవహర్‌నగర్ వంటి ప్రాంతాలు డంపింగ్ యార్డులుగా మారా యి. ఇది పౌరులూ, జీహెచ్ఎంసీ రెండింటికీ చెందిన వైఫల్యం' అని ఆయన వివరించారు. అత్యంత కీలకమైన చివరి అంశం పౌర స్ఫూ ర్తి అని ప్రొఫెసర్ రెడ్డి పేర్కొన్నారు. గాలిలో నూ, నీటిలోనూ మైక్రో ప్లాస్టిక్స్ ఉన్నాయని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణను రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(జీ) తప్పనిసరిగా పేర్కొన్నప్పటికీ, పౌరులు పర్యావరణా న్ని దెబ్బతీసే ఆచారాలను కొనసాగిస్తూనే ఉన్నారని ఆయన విమర్శించారు. స్థిరమైన ప్రణాళికలు అమలు చేయడానికి ప్రత్యేక రాష్ట్ర పర్యావరణ అభివృద్ధి కమిషన్ ఏర్పా టు చేయాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ వ్యవస్థపై మరింత బలమైన బాధ్యత నిర్ధారణ అవసరమని డిమాండ్ చేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి చెందిన పర్యావరణ శాస్త్రవేత్త శరత్ కుమార్ హైదరాబాద్‌లో కాలుష్యం ఉందని అంగీకరించినప్పటికీ, అది ఢిల్లీ స్థాయికి చేరదని అన్నారు. 'ఏఐక్యూను అర్థం చేసుకోవడంలో చాలాసార్లు గందరగోళం ఏర్పడుతుంది. మనకు 50-100 మంచి స్థాయి, 100-200 సంతృప్తికర స్థాయి. ఢిల్లీ ఏఐక్యూ గణాంకాలు జాతీయ సగటుగా తీసుకోవడం వల్ల అవి తరచూ తప్పుగా అర్థం చేసుకోవాల్సి వస్తుంద'ని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో ఏఐక్యూ ప్రాంతానికి, ప్రాంతానికి చాలా తేడా ఉంటుందని, సనత్‌నగర్, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో స్థానిక పరిస్థితుల ఆధారంగా మారుతుందని చెప్పారు. వాతావరణ పరిస్థితులు కూడా కొన్నిసార్లు కాలుష్యాన్ని తాత్కాలికంగా పెంచుతాయని తెలిపారు. ఐఐటీ కాన్పూర్‌తో కలిసి దాదాపు రూ. 1 కోటి వ్యయంతో నిర్వహించిన సోర్స్ అపోర్షన్‌మెంట్ అధ్యయనం ప్రకారం రోడ్డు ధూళి 27--30 శాతం, వాహనాలు మరో 20--30 శాతం, పరిశ్రమలు సుమారు 15 శాతం కాలుష్యానికి కారణమని వెల్లడైంది. ప్రస్తుతం దాదాపు 500 అనుబంధ పరిశ్రమలను కవర్ చేసే కార్యాచరణ ప్రణాళిక అమల్లో ఉందని ఆయన తెలిపారు. ఇందులో ఆకస్మిక తనిఖీలు, వాహనాల పర్యవేక్షణ, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, చార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, మొక్కల నాట్లు, రియల్‌టైమ్ గాలి నాణ్యత పర్యవేక్షణ వంటి చర్యలు ఉన్నాయి. 'మన అవగాహన, చర్యలే కీలకం. ఉల్లంఘనలను అరికట్టడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత అవసరమ'ని శరత్ కుమార్ అన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కే పురుషోత్తం రెడ్డి ఒక కఠిన హెచ్చరిక జారీ చేస్తూ హైదరాబాద్ నిజంగానే ఢిల్లీ దిశగా కదులుతోందని అన్నారు. ఢిల్లీ భౌగోళిక పరిస్థితులు అక్కడి కాలుష్యాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయని ఆయన వివరించారు. హిమాలయాలు, ఉత్తర పర్వత శ్రేణులు గోడలా నిలిచి, గాలిని అడ్డుకుంటాయని, దాంతో ధూళి అక్కడే చిక్కుకుపోతుందని చెప్పారు. అనేక ప్రాంతాల నుంచి వచ్చే ధూళి, థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుకతో కలిసిపోయి, సూక్ష్మ కణాలను పెంచి గాలిని అత్యంత విషపూరితంగా మారుస్తోందని ఆయన అన్నారు. ఢిల్లీ అభివృద్ధిని ప్రణాళిక చేయడంలో పర్యావరణ పరిమితులను పర్యావరణ మంత్రిత్వ శాఖ చాలా ముందే పరిగణనలోకి తీసుకోవాల్సింద'ని ఆయన తెలిపారు. భారత ప్రభుత్వం అప్పుడప్పుడు మాత్రమే జాతీయ పట్టణీకరణ కమిషన్లను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు.

# ఇరాన్‌లో అస్థిర పరిస్థితులు

న్యూఢిల్లీ, :ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నిరసనల కారణంగా ఇప్పటివరకు సుమారు రెండు వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యం లో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లోని భారతీయు లు జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత త్వరగా ఇండియాకు వచ్చేయాలని సూచించింది. శుక్రవారం రాత్రి రెండు కమర్షియల్ విమానాలు భారతీయులతో ఢిల్లీ చేరుకున్నాయి. అయితే.. అవి రెండూ రెగ్యులర్ విమానాలే. భారతీయులను ఇరాన్ నుంచి ఇండియాకు తరలించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విమానాలు కాదు. ఇక.. భారత ప్రభుత్వం అక్కడి పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అత్యవసరమైతే తప్ప ఇరాన్‌కు ప్రయాణించవద్దని భారతీయులను హెచ్చరించింది. ఇరాన్ ఎయిర్ స్పేస్ తాత్కాలికంగా మూసివేయ డంతో జనవరి 15 నుంచి రెండు దేశాల మధ్య పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇప్పుడిప్పుడే ఎయిర్ స్పేస్ పరిస్థితులు సాధారణ స్థితిలోకి వస్తున్నాయి. దీంతో భారతీయులు అక్కడి నుంచి ఇండియాకు వచ్చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం తమకు ఎంతో సాయం చేసిందని అంటున్నారు. శుక్రవారం రాత్రి ఇండియాకు చేరుకున్న ఓ ఎంబీబీఎస్ విద్యార్థిని మీడియాతో మాట్లాడుతూ.. 'నేను నిరసనల గురించి విన్నాను. కానీ, నేరుగా చూడలేదు. అక్కడ ఇంటర్‌నెట్ కూడా లేదు' అని చెప్పుకొచ్చారు. మరో వ్యక్తి స్పందిస్తూ.. 'మేము బయటకు వెళ్లినపుడు నిరసనకారులు కారుకు అడ్డంగా వచ్చారు. కొంచెం ఇబ్బంది పెట్టారు. అక్కడ ఇంటర్ నెట్ కూడా లేదు. ఆ కారణంతో ఇండియాలోని మా కుటుంబాలకు విషయం చెప్పలేకపోయాం. ఆఖరికి ఇండియన్ ఎంబసీని కూడా సంప్రదించలేకపోయాం' అని వాపోయారు

# 'యూరప్ ట్రిప్' వెయ్యాల్సిందే...




ప్రయాణాలు అత్యంత ఆహ్లాదకరంగా సాగుతాయి. పొగమంచుతో నిండిపోయే హిల్ స్టేషన్లు.. వెండిరంగులో మెరిసే మంచు పర్వతాలు యాత్రికులనురా రమ్మని పిలుస్తుంటాయి. ఇక మంచు దుప్పటి కప్పుకొన్న కొండలపై స్కీయింగ్, స్నోబోర్డింగ్ లాంటి సాహస క్రీడలు.. అంతులేని థ్రిల్‌ను పంచుతాయి. అయితే, ఇలాంటి యాత్రలు చేయాలంటే.. చాలామంది 'యూరప్ ట్రిప్' వెయ్యాల్సిందే అంటారు. కానీ, మన దేశంలోనూ అ: తకుమించిన అనుభూతుల్ని అందించే అందమైన పర్యాటక కేంద్రాలెన్నో ఉన్నాయి. సిమ్లా (హిమాచల్ ప్రదేశ్): స్విస్ గ్రామీణ ప్రాంతాలే కాదు.. మన సిమ్లా కూడా భూతల స్వర్గమే! మంచుతో నిండిపోయే రోడ్లు, చెక్క కుటీరాలు, దట్టమైన దేవదారు అడవులు.. స్విట్జర్లాండ్‌ను తలపిస్తాయి. ఇక ఇక్కడి వలసరా జ్యాల కాలం నాటి వారసత్వ భవనాలు.. ఆ పాత చారిత్రక వాతావరణాన్ని కళ్లకు కడతాయి. ముఖ్యంగా, శీతాకాలంలో ఈ ప్రాంతమంతా పొగమంచుతో ఆహ్లాదకరంగా మారుతుంది. ఆకర్షణీయమైన యూరోపియన్ స్పర్శను అందిస్తుంది. ప్రకృతి సౌందర్యం, సాహస క్రీడలు, స్కీయింగ్, స్కేటింగ్, యాక్, పోనీ సవారీలకు సిమ్లా ప్రసిద్ధి. ఇక్కడికి 15 కి.మీ. దూరంలోని కుఫ్రీ కూడా అదుతమైన సందర్శన స్థలమే! ఇక్కడ 'కుఫ్రీ ఫన్ వరల్డ్ వైల్డ్‌లైఫ్ జూలో మంచు చిరుత పులులు, యాక్ వంటి జంతువులను వాటి సహజ ఆవాసాలలో చూడవచ్చు.

గుల్మార్గ్ (జమ్మూ - కశ్మీర్): మంచు పర్వతాల్లో సందడి చేయడానికి ఆల్ప్స్ పర్వతాలే అవసరం లేదు. అంతకుమించిన హిమాలయాలు మన చెంతనే ఉన్నాయి. ఈ శీతాకాలంలో జమ్మూకశ్మీర్‌లోని గుల్మార్గ్‌కు ప్రయాణం కట్టండి. తెల్లటి మంచు దుప్పటి కప్పుకొన్న పర్వతాలు, పైన్ అడవులు.. ఆల్ప్స్ అందాలను మించిన అనుభూతిని అందిస్తాయి. ఇక్కడి మంచు కూడా మందంగా, నిర్మలంగా ఉ ంటుంది. స్కీయింగ్, స్నోబోర్డింగ్, మౌంటెన్ బైకింగ్, ట్రెక్కింగ్ వంటి సాహసయాత్రికులకు గుల్మార్గ్ స్వర్గధామమే! ఇక్కడి గండోలా రైడ్.. ప్రపంచంలోనే ఎత్తయిన కేబుల్ కార్లలో ఒకటి.

ఔలీ (ఉత్తరాఖండ్): ప్రశాంతమైన పచ్చిక మైదానాలలో సేదతీరేందుకు ఆస్ట్రియా వెళ్లామని ఆలోచిస్తున్నారా? వెంటనే విరమించుకోండి. ఉ త్తరాఖండ్‌లోని 'ఔలీని సందర్శిస్తే.. 'ఔరా!' అనాల్సిందే! ఇక్కడి ఎత్తయిన పర్వతాలు, పచ్చికబయళ్లు, ఆస్ట్రియాలోని ప్రశాంతమైన శీతాకాలపు గ్రామాలను గుర్తుకు తెస్తాయి. ఇక్కడికి ప్రయాణం కట్టేస్తే.. హిమాలయ శిఖరాల మధ్య స్కీయింగ్, ట్రెక్కింగ్‌లాంటి సాహసయాత్రలతోపాటు పచ్చిక మైదానాల్లో ప్రశాంతతనూ ఆస్వాదించొచ్చు. స్కీయింగ్, కేబుల్ కార్ (రోప్‌వే), రైడ్ చైర్ లిఫ్ట్, నందా దేవి, కామత్ పర్వతాలు.. అదుతమైన అనుభూతుల్ని పంచుతాయి. అందుకే.. ప్రొఫెషనల్ స్కీయర్లతోపాటు ఔత్సాహికులు ఔలీని వావ్‌లిస్ట్‌లో తప్పకుండా చేర్చుకుంటారు.

# ఫ్యూచర్ సిటీకి విపరీతమైన క్రేజ్



హైదరాబాద్,తెలంగాణ దిశ:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ.. దేశంలో మరే ఇతర కొత్త నగర నిర్మాణానికి దక్కని అరుదైన ప్రాముఖ్యతను దక్కించుకుంది. 13,500 ఎకరాల్లో సువిశాలంగా రూపుదిద్దుకోనున్న ఈ నగరం, కేవలం రెండు రోజుల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025 విజయ ఉత్తో ప్రపంచ పారిశ్రామిక పటంలో కీలక గమ్యస్థానంగా నిలిచింది. ఈ సమ్మిట్‌లో 44 దేశాల ప్రతినిధులు హాజరు కావడం, రూ.5.7 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరగడం ఫ్యూచర్ సిటీ పట్ల ఇన్వెస్టర్ల విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది.దేశంలో ఇప్పటికే అనేక స్మార్ట్ సిటీలు, కొత్త నగరాల నిర్మాణ ప్రతిపాదనలు దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమైన సందర్భాలు ఉన్నాయి. కానీ భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించడం అనేది సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ దార్శనికత, కార్యాచరణ వేగానికి నిదర్శనం అని పలువురు అభిప్రాయపడు తున్నారు. సమ్మిట్ ముగిసిన వెంటనే ఫ్యూచర్ సిటీ కార్యరూపం దాల్చడానికి మార్గం సుగమమైంది. మౌలిక సదుపాయాలు, డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్,న్ఫ్రా, ఎంటర్టైన్మెంట్, డిఫెన్స్, ఏఐ వంటి రంగాలకు లక్షల కోట్ల పెట్టుబడులు తరలివస్తున్నా యి. ఈ ప్రాంతాన్ని నివాస కేంద్రంగా, వ్యాపార, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.భార త్ ఫ్యూచర్ సిటీ నగరాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్ సిటీ, ఎంటర్టైన్మెంట్, క్రీడలు, డేటా సెంటర్స్, అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల జిల్లాలుగా మొత్తం ఆరు విభాగాలుగా నిర్మించ నున్నారు. ముఖ్యమైన నిర్మాణ ప్రక్రియలో భాగంగా డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలు కేటాయించారు, వచ్చే ఫిబ్రవరి చివరలో నిర్మాణాలు ప్రారంభం కానున్నాయి. ఇక మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు మొదలవుతా యి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షల మేరకు ఈ 13,500 ఎకరాల నగరాన్ని జీరో కార్బన్ సిటీగా రూపొందించే లక్ష్యంతో.. నగరం అంతటా అర్బన్ ఫారెస్ట్‌లు, రెయిన్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఫార్మా, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో పరిశోధన, మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఇక్కడ ఉంటాయి. ఈ నగరం సమగ్ర జీవన కేంద్రంగా ఉండనుంది. ఇక్కడ 13 లక్షల మందికి ఉద్యోగాలు, 9 లక్షల జనాభా కోసం నివాస సముదాయాలు ఏర్పాటవుతాయి. అంతేకాకుండా రిలయన్స్ ఫౌండేషన్ వంతారతో వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఏర్పాటుతో పాటు ఎంటర్టైన్మెంట్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లు, స్టార్ హోటళ్లు, రేసింగ్ ట్రాక్‌లు వంటి వినోద, క్రీడా సౌకర్యాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం అద్భుతమైన మౌలిక వసతులు, అత్యాధునిక రవాణా వ్యవస్థతో ఒక ఆర్కిటెక్చరల్ అద్భుతంగా నిలవనుంది. సమ్మిట్ విజయం తర్వాత దేశంలో ఏ కొత్త నగరానికి దక్కని ప్రాముఖ్యత ఈ ప్రాజెక్టుకు దక్కింది. ఇది తెలంగాణ విజ న్–2047 లక్ష్యాలకు అనుగుణంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# మళ్లీ విస్తరణ ఆశలు...


అదిలాబాద్,: ఉన్నది రెండు క్యాబినెట్ బెర్తులు. ఎంతోమంది ఆశావ హులు. మరెన్నో క్యాస్ట్ ఈక్వేషన్స్. అయినా తన లెక్కలు తనకు ఉ న్నాయంటున్నారు ఓ ఎమ్మెల్యే. ఎంబీసీ కోటాలో తనకు మినిస్ట్రీ పక్కా అని ధీమాగా ఉన్నారు. ఐయామ్ మోస్ట్ ఎలిజిబుల్ పర్సన్ అంటూ.. ఓ రేంజ్‌లో హోప్స్ పెట్టుకుని హైప్ క్రియేట్ చేస్తున్నారు. ఇంతకు ఎవరా ఎమ్మెల్యే? ఆయనకు అమాత్య యోగం అంత దగ్గరలో ఉందా?రెండో సారి క్యాబినెట్ విస్తరణపై ఆ ఎమ్మెల్యే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎంబీసీ కోటా.. డిస్ట్రిక్ట్ ఈక్వేషన్స్ ఎలా ఎన్నో లెక్కలు వేసుకున్నా.. అప్పట్లో జస్ట్ మిస్. అయినప్పటికీ పట్టు వదలని విక్రమార్కుడిలా అలుపెరగని ప్రయత్నాలు చేస్తున్నారు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. ఇంకా మంత్రి వర్గంలో రెండు బెర్తులు ఖాళీగా ఉండటంతో..ఎంబీసీ కోటాలో ఛాన్స్ కోసం పట్టుబడుతున్నారట. రెండో విడత మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకోవాలనే ఆశతో సౌత్ టు నార్త్ ఎఫర్ట్స్ పెట్టినప్పటికీ ఫలితం దక్కలేదట.అయితే సామాజిక సమీకరణాల నేపథ్యంలో ఇరుగు పొరుగు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మంత్రులయ్యారు కానీ..మక్కాన్ సింగ్ కోరిక నెరవేర లేదు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలలో మోస్ట్ బ్యాక్ వర్డ్ క్యాస్ట్ ఎమ్మెల్యేగా మక్కాన్ సింగ్ ఒక్కరే ఉన్నారు. మొదటి నుంచి ఎంబీసీ కోటాలో తనకు బెర్త్ దక్కడం ఖాయమని భావించిన ఆయనకు.. జిల్లా ఈక్వేషన్స్ మాత్రం అడ్డంకిగా మారుతు న్నాయట. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ముగ్గురు మంత్రు లు కేబినెట్ లో ఉండటంతో ఆయనకు ఛాన్స్ దక్క లేదు. అయితే నెక్స్ట్ విస్తరణలో మాత్రంజిల్లా నుండి ఓ మంత్రిని తప్పించైనా మక్కాన్ సింగ్ కు బెర్త్ ఖాయమనే చర్చ జోరుగాసాగుతోం ది.2014, 2018లో రెండుసార్లు రామగుండం నుంచి పోటీ చేసి ఓడిన మక్కాన్ సింగ్.. 2023 ఎన్నికల్లో మాత్రం గెలుపొందారు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి హయంలో మక్కాన్ సింగ్ కు శాప్ ఛైర్మన్ పదవి దక్కింది. రాజశేఖర్ రెడ్డికే కాదు ఏపీ మాజీ సీఎం జగన్ తోసత్సంబంధాలున్న ప్పటికి? మారిన రాజకీయ పరిణామాల తో ఆశించిన పదవులు ఆమడ దూరమయ్యాయి. ఇప్పుడు ఎమ్మెల్యేగా విజయం సాధించడం, పార్టీ అధికారంలో ఉండడంతో..ఎంబీసీ స్లోగన్ కలిసి వస్తుందనుకున్నారు. మొదటి విడతలో బీసీ కోటాలో పొన్నం ప్రభాకర్, కొండా సురేఖకు మంత్రి పదవులు దక్కగా..రెండో విడత క్యాబినెట్ విస్తరణలో వాకిటి శ్రీహరి మంత్రి అయ్యారు. ఎంబీసీ కోటాను పరిగణలోకి తీసుకుంటే? తనకు మినిస్టర్ పదవి దక్కుతుంద నేది మక్కాన్ సింగ్ నమ్మకం. క్యాబినెట్ లో మొత్తం 18మందికి అవకాశం ఉండగా..సీఎంతో కలిసి 16మందితో క్యాబినెట్ కొనసాగు తుంది. మొదటి విడతలో 11 మందిని, రెండో విడతలో ముగ్గురికి క్యాబినెట్ లో బెర్త్ లు దక్కాయి. జూబ్లీహిల్స్ ఎన్నికలకు ముందు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో మరో రెండు ఖాళీలు మాత్ర మే మిగిలి ఉన్నాయి. మిగిలిన రెండింట్లో ఓ ఛాన్స్ ఇవ్వాలంటున్నా రట మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. పార్టీకి వీర విధేయుడిగా పని చేయడమే కాదుసామా జిక పరంగా చూసుకున్నా మోస్ట్ ఎలిజిబుల్ పర్సన్ అంటున్నారట. సీఎంరేవంత్ రెడ్డికి సన్నిహి తుడేకాదు.రాహుల్ గాంధీతో మంచి సంబంధాలున్నాయి.ఇక అమాత్య పదవి దక్కితే మాత్రం మొదటి మంత్రిగా రామగుండం పొలిటికల్ హిస్టరీలో మిగిలి పోనున్నారు. కాబట్టి? మక్కాన్ మంత్రి పదవి కోసం మాములుగా ట్రై చేయడం లేదట. అయితే అమాత్య రేసులోఉన్న మక్కాన్ సింగ్ కు?రెండోసారి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడి పదవి దక్కింది. డీసీసీ ప్రెసిడెంట్ పోస్ట్ వచ్చినా తన సీనియారిటీకి తగ్గ పదవి ఇవ్వలేదనే అసంతృప్తితో ఉన్నారట ఎమ్మెల్యే. మంత్రి పదవిఎలాగో పెండింగ్ లో పడుతుంది.. కనీసం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ అయినా ఇవ్వాలి కదా అంటూ తన సన్నిహితుల దగ్గర డిస్కస్ చేస్తున్నారట. మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కల నెరవేరుతుందా.. ఆయన మంత్రి పదవి ఆశ తీరుతుందో చూడాలి.

# డివిజన్ల పునర్విభజన షురూ!

హైదరాబాద్,తెలంగాణ దిశ : ఎల్బీనగర్ నియోజకవర్గంలో డివిజన్ల పునర్విభజనతో నూతన డివిజన్ల ఏర్పాటుతో పాటు రాజకీయ వర్గాల్లో నూతనోత్సాహం కనిపిస్తుంది. జీహెచ్ఎంసీలో శివారు ప్రాంతాలను విలీనం చేసిన అనంతరం నూతన డివిజన్లను వాటి పేర్లలో ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకటించారు. కాగా, ఎల్బీనగర్ జోనల్ లోని హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిళ్ల పరిధిలోని డివిజన్లను పునర్విభజన చేశారు. అనంతరం 9 నూతన డివిజన్లు ఏర్పాటు కాబోతున్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మూడు సర్కిళ్లలో ఇప్పటివ రకు మొత్తం 13 డివిజన్లు ఉండగా, వాటి స్థానంలో మొత్తం 22 డివిజన్లు రానున్నాయి. నూతన డివిజన్ల ఏర్పాట్లపై అభ్యం తరాలు, సలహాలు, సూచనలు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు కోరుతున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు 11 డివిజన్లు ఉన్నాయి.

ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11 డివిజన్లు ఉన్నాయి. వీటికి అదనంగా నూతనం గా 7డివిజన్లు ఏర్పాటు చేయడంతో మొత్తంగా 18డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. ఎల్బీనగర్ నియోజ కవర్గం పరిధిలో ఉన్న మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన సరూర్ నగర్, ఆర్కేపురం డివిజన్లను సైతం పునర్విభజన చేశారు. రెండు డివిజన్ల స్థానం లో మరో రెండు డివిజన్లు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం జీహెచ్ఎంసీ జోనల్ పరిధిలో ఇప్పటి వరకు మూడు సర్కిళ్ల ఉన్నాయి. వీటిలో హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిళ్లు ఉన్నాయి. హయత్ నగర్ సర్కిల్ పరిధిలో నాలుగు డివిజన్లు నాగోల్, మన్సూరాబాద్, హయత్ నగర్, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్లు ఉన్నాయి. ఎల్బీనగర్ సర్కిల్ లో ఇప్పటివరకు వనస్థలిపురం, హస్తినాపురం, చంపాపేట, లింగోజిగూడ డివిజన్లు ఉన్నాయి.సరూర్ నగర్ సర్కిల్ లో ఇప్పటివరకు కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం, సరూర్ నగర్, ఆర్కే పురం డివిజన్లు ఉన్నాయి. మూడు సర్కిళ్ల పరిధిలోని డివిజన్లను పునర్విభజన చేసి, కొత్తగా ఎనిమిది డివిజన్లు ఏర్పాటు చేశారు. సరూర్ నగర్ సర్కిల్ పరిధిలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజ న్లను యథావిధిగా ఉంచారు. అయితే, మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్ నగర్ డివిజన్ ను విభజించి డాక్టర్స్ కాలనీ పేరుతో కొత్త డివిజన్, రామకృష్ణాపురం డివిజన్ ను విభజించి ఎన్టీఆర్ నగర్ పేరుతో నూతన డివిజన్ ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఎల్బీనగర్ సర్కిల్ లో ఉ న్న చంపాపేట డివిజన్ విభజించి నూతనంగా కర్మన్ ఘాట్, హస్తినా పురం డివిజన్ నుంచి బైరామల్ గూడ, వనస్థలిపురం డివిజన్ నుంచి చింతలకుంట,నాగోల్ డివిజన్ నుంచి సాయినగర్, మన్సూరా బాద్ డివిజన్‌నుంచి లెక్చరర్స్ కాలనీ, హయత్ నగర్ డివిజన్ నుంచి హైకోర్టు కాలనీ, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ నుంచి సాహెబ్ నగర్ డివిజన్లను ఏర్పాటుచేశారు. తాజాగా ఎల్బీనగర్ నియోజకవ ర్గంలో7 డివిజన్లు, మహేశ్వరం నియోజకవర్గంలో 2 నూతన డివిజ న్లు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని సరూర్ నగర్‌సర్కిల్ పరిధిలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజ న్లను యథావిధిగా ఉంచారు. నియోజకవర్గంలోని డివిజన్ల పు నర్విభజనతో రాజకీయ పార్టీల్లో నూతనోత్తేజం కనిపిస్తుంది. సుమారు 40 వేల జనాభాకు ఒక డివిజన్ ఏర్పాటు చేస్తుండడంతో కొత్తవారికి రాజకీయ రంగ ప్రవేశం లభిస్తుంది. పాలన వికేంద్రీకర ణ కావడంతో ప్రజలకు మౌలిక, కనీస సౌకర్యాలు, వసతులు అందుబాటులోకి వస్తాయి. దీంతో పాటు కొత్తగా రాజకీయ అవకా శాలు అందరికీ అందుబాటులోకి వస్తాయి.

# పేకాట స్థావరం.. డ్రోన్ నిఘాతో బహిర్గతం



అనంతపురం,తెలంగాణ దిశ :అనంతపురం జిల్లా పోలీసులు వినూ త్న విధానాలను అవలంబిస్తున్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపా లు,ముఖ్యంగా పేకాట స్థావరాలపై ఉక్కుపాదం మోపేందుకు పోలీ సులు సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అందులో భాగంగా రాయ దుర్గం మండలం గొల్లలదొడ్డి గ్రామ శివారు ప్రాంతంలో యదేచ్ఛగా జరుగుతున్న పేకాట స్థావరాన్ని పోలీసులు డ్రోన్ సహాయంతో గుర్తించారు. గుర్తించడమే కాకుండా పేకాట ఆడుతున్న వారిపై మెరుపు దాడి చేశారు. పోలీసుల ఈ వినూత్న నిఘా విధానం పేకాట ఆడేవా రికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అందుకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. గొల్లలదొడ్డి గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో ఏడుగురు వ్యక్తులు గుమిగూడి పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం పోలీసులకు అందింది. అయితే గతంలో మాదిరిగా నేరుగా దాడి చేయకుండా, అనుమానితుల కదలికలను ముందుగా డ్రోన్ ద్వారా నిశితంగా పరిశీలించాలని పోలీసులు నిర్ణయించుకున్నారు. ఆకాశంలో చక్కర్లు కొడుతున్న డ్రోన్ శబ్దం వినగానే, తమ స్థావరంపై నిఘా పడిందని పేకాట ఆడేవారు గ్రహించారు. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ ఆందో ళనపడ్డారు. పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకునేందుకు పొలాల్లో కి, ముళ్లపొదల్లోకి పరుగు లంకించుకున్నారు. ఇదంతా కూడా డ్రోన్ విజువల్స్ లో రికార్డు అయ్యింది. అయితే వారి పారిపోతున్న దిశలను కూడా పోలీసులు గమనిస్తున్నారనే విషయాన్ని పేకాట ఆడిన వారి గ్రహించలేదు.అయితే డ్రోన్ ద్వారా వారి కదలికలను పర్యవేక్షించిన పోలీసులు పారిపోతున్న ఏడుగురు వ్యక్తులను చుట్టుముట్టి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.

ఈ సందర్భంగా వారి వద్ద నుంచి 15,050 రూపాయల నగదుతో పాటు పేకాట ఆడేందుకు వినియోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ?కొత్త టెక్నాలజీని ఉపయోగించి పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించడంపై స్థానికులు, ముఖ్యంగా శివారు ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో డ్రోన్ నిఘా ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో కూడా ఈ తరహా నిఘాను కొనసాగించాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై నిఘా కొనసాగుతుందని, ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా పోలీసు అధికారులు హెచ్చరించారు.

## హైదరాబాద్లో నగ్జియాన్ ఎనర్జీ యూనిట్


హైదరాబాద్,తెలంగాణ దిశ : సోడియం–అయాన్ బ్యాటరీ కంపెనీ నగ్జియాన్ ఎనర్జీ, తన ఉత్పత్తి సదుపాయాలను విస్తరించడానికి రూ.200 కోట్లు పెట్టు బడి పెట్టనుంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ, కోయంబత్తూరులోని తన యూనిట్లో మొబిలిటీ, ఎనర్జీ స్టోరేజ్ అప్లికేషన్ల కోసం అధిక సామర్థ్యం గల సోడియం అయాన్ బ్యాటరీ ప్యాక్‌ను అభివృద్ధి చేస్తోంది. ఇప్పుడు హైదరాబాద్లో కొత్త యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఇది 2026 చివరికి సిద్ధం అవుతుం దని అంచనా. తమ వినియో గదార్ల నుంచి పెరుగుతున్న డిమాండ్ను దృష్టిలో పెట్టుకుని, కొత్త యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సీఈఓ అభిషేక్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ప్లాంట్, సెల్ తయారీ సదుపాయం ఇందులో ఉంటాయన్నారు. తొలి సారిగా సోడియం అయాన్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ను తమ సంస్థ తయారు చేస్తోందని, ఇటీవలే తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో బ్యాటరీ, ఇన్వర్టర్, సోలార్ మ్యాగ్జిమమ్ పవర్ పాయింట్ ట్రాకింగ్ (ఎంపీ పీటీ) ఉంటాయి.

# చమురు ట్యాంకర్‌ను సీజ్ చేసిన ఇరాన్

న్యూఢిల్లీ: ఒమన్‌లో భారీ పరిమాణంలో చమురును మోసుకెళ్తున్న ఒక నౌకను ఇరాన్ సీజ్ చేసింది. అందులో భారతీయు లతోపాటు శ్రీలంక, బంగ్లాదేశ్‌కు చెందిన 18 మంది సిబ్బంది ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన జరిగింది. 60 లక్షల లీటర్ల చమురును అక్ర మంగా తరలిస్తున్నారని, అందుకే నౌకలోని నావిగేషన్ వ్యవస్థలన్నింటినీ నిలిపివేశారని ఇరాన్ మీడియా వెల్లడించింది. గతంలో అక్రమంగా ఇంధనం రవాణా చేస్తోన్న నౌకలను అడ్డుకుంటు న్నట్లు ఇరాన్ ఇప్పటికే పలుమార్లు వెల్లడించింది. చమురు ఉత్పత్తి చేస్తోన్న దేశాల్లో ఒకటైన ఇరాన్‌లో చమురు ధరలు అతి తక్కువగా ఉంటాయి. అందుకే ఇక్కడినుంచి ఇతర దేశాలకు అక్రమంగా ఎగు మతి చేసి, కొందరు భారీ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ కార్యకలాపాలను ఇరాన్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటోంది. కాగా వెనెజువెలా తీరంలో రెండు రోజుల క్రితం అమెరికా ఒక ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్ చేసింది. నౌక కెప్టెన్ వెనెజువెలా, ఇరాన్ నుంచి అక్రమంగా చమురు రవాణా చేస్తున్నాడన్న ఆరోపణలతో ఈ నౌకను అగ్రరాజ్యం అడ్డుకుంది. వెనెజువెలా తీరం నుంచి క్యూబాకు బయలుదేరిన ఈ భారీ నౌకను అమెరికా సైనికులు తమ అధీనంలోకి తీసుకున్నారు. హెలికాప్టర్‌లో వెళ్లి షిప్‌పై దిగారు. ఆయుధాలతో షిప్ సిబ్బందిని చుట్టుముట్టిన వీడియోను అమెరికా మీడియాకు విడుదల చేసింది.

ఇప్పటి వరకు సీజ్ చేసిన వాటిలో ఇదే అతిపెద్ద ఆయిల్ ట్యాంకర్ డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇకముందు కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతాయని అన్నారు. అది జరిగిన రెండు రోజులకే ఇరాన్ ఈ నౌకను సీజ్ చేసింది. ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉ న్న హర్మూజ్ జలసంధి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20 శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం–ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల బారెళ్ల చమురు వివిధ దేశాలకు వెళ్తుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ) రవాణాకు కూడా అత్యంత కీలకం. మొత్తం ఒక వంతు ఎల్ఎన్జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది.

## హిమాలయాల్లో న్యూక్లియర్ డివైస్..




న్యూఢిల్లీ: హిమాలయాల్లోని నందా దేవి కొండల్లో ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి న్యూక్లియర్ డివైస్ కూరుకుపోయింది. చైనాపై గూఢచ ర్యం కోసం 1965లో సీఐఏ రహస్యంగా ఓ మిషన్‌ను నిర్వహించింది. దీనిలో భాగంగా ప్లుటోనియం పవర్ జనరేటర్‌ను అమెరికన్, ఇండియన్ పర్వతారోహకులు తీసుకెళ్లారు. అది ప్రమాదవశాత్తు ఇక్కడ పడిపోయింది. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుందనే ఆందోళన దశాబ్దాల నుంచి వ్యక్తమవుతున్నది. జపాన్‌లోని నాగసాకిపై వేసిన అణు బాంబులో ఉన్న పీయూ–239 ఐసోటోప్, అత్యధిక రేడియోధార్మిక ఇంధనం పీయూ–238 ఈ డివైస్‌లో ఉండటంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ మిషన్‌ను నిర్వహించిన వారిని విస్తృత స్థాయిలో ఇంటర్వ్యూలు చేసినవారు, అమెరికా, భారత్ ప్రభుత్వాల వద్ద ఉన్న రహస్య పత్రాలను పరిశీలించినపుడు, ఈ డివైస్ గురించి బయటపడింది. ఈ డివైస్‌పై సమాచారం చెప్పాలని భారతీయులు 1970వ దశకం నుంచి ఇప్పటికీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ న్యూక్లియర్ డివైస్ మంచు ప్రవాహంలో కొట్టుకొస్తే, రేడియో ధార్మిక పదార్థం గంగా నదిలో కలిస్తే, కోట్లాది మందికి క్యాన్సర్ ముప్పు తప్పదని హిమాలయాల సమీపంలోని గ్రామస్థులు,పర్యావరణవేత్తలు, రాజకీయ నాయకులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ప్లుటోనియం అత్యంత విషపూరిత పదార్థం.

# పూరి-సేతుపతి మూవీ టైటిల్ స్లమ్ డాగ్

విజయ్ సేతుపతి -పూరి జగన్నాథ్ కాంబోలో రానున్న సినిమా టైటిల్ ఖరారయ్యింది. ఇప్పటివరకూ 'పూరి సేతుపతి'గా ప్రచారంలో ఉన్న ఈ సినిమా టైటిల్‌ను తాజాగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'స్లమ్ డాగ్' అనే పేరు ఖరారు చేశారు. '33 టెంపుల్ రోడ్' అనేది ఉపశీర్షిక. టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి ఆసక్తికర లుక్‌లో కనిపించారు. చేతిలో కత్తి పట్టుకొని కళ్లజోడుతో పవర్‌ఫుల్‌గా ఉన్నారు. ఈ పోస్టర్‌ను పంచుకున్న టీమ్ ఆసక్తికర క్యాప్షన్‌ను షేర్ చేసింది. 'మురికివాడల నుంచి ఎవరూ తట్టుకోలేని తుపాను వస్తుంది.. అది చాలా భయంకరంగా ఉంటుంది' అనే క్యాప్షన్ ఇందులో విజయ్ పాత్ర తీరును తెలిపేలా ఉంది.

ఎన్నో రోజులుగా ఈ సినిమాకు రకరకాల టైటిల్స్ వినిపించాయి. ఇప్పుడు వాటికి చెక్ పెడుతూ 'స్లమ్ డాగ్'ను అధికారికంగా ప్రకటించారు. గతేడాది జులై మొదటివారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి ఐదు నెలల్లోనే కంప్లీట్ చేసేశారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. సంయుక్త కథానాయికగా నటించారు. టబు , విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రం ముస్తాబైంది. విజయ్ సేతుపతి ఇందులో మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.




# 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్‌పై దిల్ రాజు క్లారిటీ

'ఎల్లమ్మ' సినిమా అనౌన్స్ చేసిన రోజు నుంచి ఈ చిత్రాన్ని వరుస ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దర్శకుడు వేణు యూడుగంటి (వేణు బలగం) రూపొందిస్తున్న ఈ ప్రాజెక్ట్ పట్ల భారీ అంచనాలు ఉండగా, రెండేళ్లుగా హీరో ఎవరు అనే విషయంలో మాత్రం గందరగోళం కొనసాగుతోంది. మొదట ఈ సినిమాలో నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్నాడని ప్రకటించిన మేకర్స్, ఫస్ట్‌లుక్ కూడా విడుదల చేశారు. అయితే అనుకోని కారణాల వల్ల నాని ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు.తర్వాత ఈ చిత్రంలో నటించేందుకు శర్వానంద్ ఎంట్రీ ఇచ్చారు. కొంతకాలం తర్వాత ఆయనే తప్పుకున్నారు. అనంతరం నితిన్ హీరోగా ఫిక్స్ అయిపోయారని, షూటింగ్ కూడా త్వరలో ప్రారంభమవుతుందని నితిన్ స్వయంగా ప్రకటించారు. కానీ కొన్ని రోజులకే ఆయనను కూడా ఈ చిత్రం నుంచి తప్పించారని సమాచారం. ఇలా వరుసగా ముగ్గురు హీరోలు మారడంతో 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ భవిష్యత్తుపై ప్రశ్నలు మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో చివరకు ఈ చిత్రానికి సంబంధించి నిర్మాత దిల్ రాజు క్లారిటీ ఇచ్చారు. గోవాలో జరుగుతున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ.. ఎల్లమ్మ సినిమాకు హీరో ఇప్పటికే ఫైనల్ అయ్యాడు. త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. అలాగే హీరోయిన్ వివరాలు కూడా డిసెంబర్‌లో వెల్లడిస్తాం. మా బ్యానర్ నుంచి 2026లో ఆరు సినిమాలు రిలీజ్ అవుతాయి.

వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తాం. ప్రస్తుతం 'రౌడీ జనార్ధన్' షూటింగ్ జరుగుతోంది" అని తెలిపారు. దీంతో 'ఎల్లమ్మ' సినిమాను ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు ఇది నిజంగా గుడ్ న్యూస్. ఇన్ని మార్పుల తర్వాత కూడా ప్రాజెక్ట్ నిలిచేలా ఉండటం మేకర్స్ నమ్మకాన్ని చూపిస్తోంది. ఇప్పుడు అందరి చూపు కొత్త హీరో, హీరోయిన్ ఎవరన్న దానిపైనే ఉంది. ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుంది అనే దానిపై కూడా త్వరలోనే క్లారిటీ రానుంది. కొద్ది రోజుల క్రితం బలగం అనే చిత్రంతో బిగ్గెస్ట్ హిట్ కొట్టిన వేణు ఇప్పుడు తన రెండో చిత్రంతో ఎలాంటి విజయం అందుకుంటాడో చూడాలి.

# గ్లామర్ తో హీటెక్కిస్తున్న రకుల్..





హీరోయిన్స్ ఒకవైపు సినిమాలలో నటిస్తూనే.. మరొకవైపు సోషల్ మీడియాలో తమ అందంతో ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. అంతేకాదు ఫాలోవర్స్ లో పెంచుకున్న తర్వాత పలు ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ అలా కూడా ఆదాయాన్ని పొందుతున్న విషయం తెలిసిందే. ఇకపోతే ఫాలోవర్స్ పెరగాలంటే రోజుకు ఒక గ్లామర్ ట్రీట్ ఇవ్వాల్సిందే అనే రేంజ్ లో ప్రస్తుతం ట్రెండ్ నడుస్తోంది అంటూ నెటిజన్లు కూడా కామెంట్లు చేస్తూ ఉంటారు. మరోవైపు ఈ మధ్యకాలంలో హీరోయిన్స్ సినిమా షూటింగ్ లతో బిజీగా ఉన్నప్పటికీ.. మరోవైపు అభిమానులకు చేరువ అవ్వడానికి నిత్యం ఫోటోషూట్ తో ఆకట్టుకుంటున్నారు. అందులో భాగంగానే తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ కూడా తన గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. బ్లాక్ కలర్ లెహంగా ధరించిన ఈమె.. దీనికి కాంబినేషన్ లో సిల్వర్ కలర్ హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన ఒక కోట్ ధరించి.. తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. ముఖ్యంగా గార్జియస్ లుక్ లో అదిరిపోయే స్టిల్స్ ఇచ్చి మరింత అందంగా కనిపిస్తోంది ఈ ముద్దుగుమ్మ. తన మెడను ప్రత్యేకంగా డిజైన్ చేసిన జువెలరీ తో ఫుల్ ఫిల్ చేసుకుంది. ఇక మత్తెక్కించే కళ్ళతో.. మరింత అందంగా ముస్తాబయింది. తాజాగా ఓవర్ లోడెడ్ గ్లామర్ డోస్ తో అభిమానుల ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది . అదిరిపోయే ఫోజులు ఇవ్వడంతో ఆ ఫోజులకే ఫిదా అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికైతే రకుల్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రకుల్ ప్రీత్ సింగ్ విషయానికి వస్తే.. కెరటం అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. వెంకటాద్రి ఎక్స్ప్రెస్ సినిమాతో మరింత పాపులారిటీ దక్కించుకుంది. "ప్రార్థన ప్రతి రూపాయి కౌంటింగ్ ఇక్కడ" అనే డైలాగ్ తో ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది. రకుల్ ప్రీత్ సింగ్ ఈ సినిమా తర్వాత లౌక్యం, కరెంటు తీగ, కిక్ 2 , పండగ చేసుకో, బ్రూస్ లీ, నాన్నకు ప్రేమతో,సరైనోడు, ధ్రువ, రారండోయ్ వేడుక చూద్దాం, జయ జానకి నాయక , స్పైడర్ ఇలా పలు తెలుగు చిత్రాలలో పలువురు స్టార్ హీరోల సరసన నటించి భారీ పాపులారిటీ అందు కుంది. ఇక తెలుగులో నాగార్జున సరసన మన్మధుడు 2 సినిమాలో నటించి విమర్శలు ఎదుర్కొన్న ఈమె.. ఆ తర్వాత చెక్ సినిమాలో నటించి డిజాస్టర్ ను మూటగట్టుకుంది. ఇక ఆ తర్వాత ఈమె నటించిన ఎన్నో సినిమాలు ఈమెకు పెద్దగా విజయాన్ని అందించలేదు.

# మొక్కజొన్న సాగు భళా..

## మద్దతు ధర దక్కదేమోనని రైతు ఆందోళన..!



కుభీర్: అన్నం పెట్టే రైతన్నకు సున్నం పెట్టినట్లుగా ఉంది రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం. ఆరుగాలం రెక్కలను ముక్కలు చేసుకుని కష్టించి పండించిన పంటకు మద్దతు ధర లభించక, పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్ట పోతున్న రైతన్నలకు భరోసా లేకుండా పోయింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి కారణంగా ప్రధాన పంటలైన సోయా, పత్తి దెబ్బతిని సగానికి సగం దిగుబడులు తగ్గిపోయాయి. వచ్చిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం కోర్రీలు పెట్టి 25 సోయాబీన్ కూడా కొనుగోలు చేయలేదు. దాంతో రైతులు దళారులకు, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు పంటను అమ్ముకున్నారు. పీకల్లోతూ కష్టాల్లో మునిగిపోయారు. ఫలితంగా యాసంగిలోనైనా పత్తి, సోయాకు బదులుగా మొక్కజొన్న సాగుచేసి కొంతలో కొంతైనా నష్టాన్ని పూడ్చుకొందామని మండలంలోని రైతులు భావించారు. అనుకున్నట్లుగానే గత ఏడాది యాసంగి కంటే ఈ ఏడు యాసంగిలో మొక్కజొన్నను దాదాపు రెట్టింపు సాగుచేశారు. నిరుడు 9 వేల పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్న సాగవగా.. ఈ ఏడు 13 వేల ఎకరాల్లోసాగు జరిగింది. జనవరి చివరి వారం నుండి మొక్కజొన్న కోతకు రానుంది.

ఈ తరుణంలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మొక్కజొన్నకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో గిట్టుబాటు అవుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం పంటలు సాగుచేసిన రైతాంగాన్ని ఆగం పట్టిస్తోంది. సోయా పంటను కొంటామని చెప్పి రంగు మారిందని, తేమ ఉందని, జల్లెడ పేరిట సవాలక్ష ఆంక్షలు విధించి కేవలం 40, 50 శాతం మాత్రమే కొనుగోలు చేసి రైతులను నష్టాల్లోకి నెట్టారు.

మొక్కకొన్న చేతికొచ్చిన తర్వాత అదే పరిస్థితి పునరావృతం అవుతుందేమోనన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. మొక్కజొన్నకు కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ రూ. 2400 ప్రకటించిన ప్పటికీ.. పంట చేతికొచ్చేలోపు కొనుగోలు కేంద్రాలను తెరిచి సకాలంలో కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది మార్చిలో ప్రైవేటులో క్వింటా మక్కలకు రూ.18,00 నుంచి 2,100 చెల్లించారు.

ఈ సారి మద్దతు ధర కంటే ఎక్కువగా క్వింటా మక్కలకు కనీసం రూ.2600 లభిస్తే కొంతలో కొంతైనా నష్టాలను పూడ్చుకోవచ్చ ంటున్నారు రైతులు. ప్రభుత్వం నెలరోజుల ముందే మండలంలో కనీసం 4 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేయాలని మండల రైతాంగం కోరుకుంటోంది.

ప్రభుత్వమే కొనాలి : బోయిడి సురేశ్, కుభీర్ రైతు

పెట్టుబడి సాయానికి ఎగనామం పెట్టిన రేవంత్ సర్కారు కనీసం రైతులు పండించిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. సోయాలకు కోర్రీలు పెట్టి సగం మంది రైతుల సోయా పంటను కూడా కొనలేదు. మళ్ళీ ఇప్పుడు మక్కలకు అలా చేయకుండా ప్రతి గింజను కొనుగోలు చేయాలి. రైతంగాన్ని ఆదుకోవాలి.

# సరస్వతి అంత్య పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్‌భూపాలపల్లి,తెలంగాణ దిశ:** మే21నుండి జూన్ 1వ తేదీ వరకు మహ దేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్యపుష్క రాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం దేవాలయ ఈఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్కిటెక్చర్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి సరస్వతి అంత్యపుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్స రం నిర్వహించిన సరస్వతి ఆది పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని,అంత్య పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత పుష్కరాల లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.సరస్వతి అంత్యపుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 30.16 కోట్ల నిధులను మంజూరు చేసిందని, ఇందులో రూ. 16 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అంచనాలు తయారుచేసి ప్రతిపాదనలు పంపించాలని, ఫిబ్రవరి మొదటి వారంలోపే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.కాళేశ్వరం మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా శాశ్వత పనులు చేపట్టాలని, పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలు, భద్రత, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కాళేశ్వరానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయు తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ సరస్వతి అంత్యపుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ తరపున ప్ పటిష్టమైన బందోబస్తు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, భక్తుల భద్రత వంటి అంశాలపై ముందుగానే ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక రహదారి మార్గాలను పరిశీలిస్తున్నామని, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాహనాల పార్కింగ్ సమస్యలు నివారించేందుకు మల్టీ లెవల్ పార్కింగ్ స్థలాలను గుర్తించామని, ప్రైవేట్ వాహనాల నియంత్రణకు డ్రాప్ గేట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ధార్మిక సలహాదారు గోవింద హరి మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాలను ఆది పుష్కరాల మాదిరిగానే అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అంత్యపుష్కరాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న దేవాదాయ శాఖ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా త్వరలోనే "కాళేశ్వర ఖండం" అనే పుస్తకాన్ని విడుదల చేస్తామని తెలిపారు.

# 'మిట్టల్'కు మిఠాయి..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** అయిన వారికి ఆకుల్లో కాని వారికి కంచాల్లో అనే సామెత వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వంచనాత్మకవైఖరికి సరిగ్గా నప్పుతుంది. ప్రభుత్వరంగంలోనే విశాఖ ఉక్కును కొనసాగించి సొంత గనులు కేటాయించి ఫ్యాక్టరీ అభివృ ద్ధికి కేంద్రం పూచీ పడాలని కార్మికులు, ఉద్యోగులు ఐదేళ్లుగా అలుపె రుగని పోరాటం చేస్తున్నా కనీస మాత్రం పట్టించుకోని కూటమి సర్కార్, ఆ పక్కనే ఇంకా ఉత్పత్తయినా ప్రారంభించని, కేవలం ప్రతిపాదనల దశలోనే ఉన్న ప్రైవేటు దిగ్గజం ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ కంపెనీకి మాత్రం తన మొత్తం అధికారాన్ని ఉదారంగా ధారపోస్తోంది. మొన్నటికిమొన్న మిట్టల్ స్టీల్‌కు అనకాపల్లి జిల్లా డి.ఎల్.పురంలో 2.9 కిలోమీటర్ల పొడవున రివర్ ఫ్రంట్‌ను, అంతే పొడవున సొంత పోర్టును కేటాయిస్తూ మంత్రి మండలి ఆగమేఘాల మీద నిర్ణయం తీసుకుంది. సాంకేతికంగా ఇబ్బందులు కాకుండా ఆర్సెలర్ ఎఎంఎస్ఎస్ పోర్ట్స్ రాజయ్యపేట ప్రైవేట్ లిమిటెడ్ పేరిట స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పివి)ను నెలకొల్పి, సొంత పోర్టును, రివర్‌ఫ్రంట్‌ను కేటాయించింది. ఈ చర్యతో ఆంధ్రప్రదేశ్‌కు మణిహారంగా అభివర్ణించే, 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు'గా చెప్పుకునే నవరత్న హోదా కలిగిన వైజాగ్ స్టీల్ కూటమి ప్రభుత్వానికి కానిది, ప్రైవేటు మిట్టల్ స్టీల్ అయినదైందని అర్థమవుతుంది. వైజాగ్ స్టీల్ నష్టాలకు కేంద్ర ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యాలే కారణం. దేశంలో ప్రభుత్వరంగంలోని అన్ని ఉక్కు పరిశ్రమలకు సొంత గనులు (కేప్టివ్) ఉన్నాయి. అదానీ, టాటా వంటి ప్రైవేటు స్టీల్ ఫ్యాక్టరీలకు కూడా కేప్టివ్ మైన్స్‌ను కేంద్ర సర్కార్ కేటాయిస్తోంది. విశాఖ ఉక్కుకు మాత్రం సొంత గనులు కేటాయించమంటే తిరస్కరణే ఎదురవుతోంది. కాగా సొంత మైన్స్ కేటాయించాలన్న వైజాగ్ స్టీల్ కార్మికుల ఆందోళనను పెడచెవినపెట్టి, మిట్టల్ స్టీల్‌కు సొంత గనులు కేటాయించాలని చంద్రబాబు, ఆయన ప్రభుత్వ ప్రతినిధులు మోడీ ప్రభుత్వం వద్దకు కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నారు. ఇప్పుడు ఏకంగా సొంత పోర్టుకు, రివర్‌ఫ్రంట్‌కు గ్రీన్ సిగల్ ఇచ్చేశారు. సముద్ర తీరం దేశంలో ఏ ఇతర భారీ ఉక్కు ఫ్యాక్టరీలకు లేని ప్రత్యేకత వైజాగ్ స్టీల్ సొంతం. ఆ ప్రత్యేకతను ప్రైవేటు రంగంలో నెలకొల్పబడే మిట్టల్ కంపెనీ కొల్లగొట్టేందుకు కూటమి సర్కార్ మార్గం వేయడం అన్యాయమైనది. ఇప్పటికే వైజాగ్ స్టీల్‌కు కొంత వరకు అనుకూలంగా ఉన్న గంగవరం పోర్టును అదానీకి అప్పగించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ పేరిట వైజాగ్ స్టీల్‌కు చెందిన 2,500 ఎకరాలు కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ముమ్మర యత్నాలు జరుగుతున్నాయి. ఈ చర్యలు వైజాగ్ స్టీల్‌ను మరింత నిర్వీర్యపరుస్తాయి. విశాఖ ఉక్కును 'వ్యూహాత్మకంగా' విక్రయించాలని 2021 జనవరి లో కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించింది మొదలు ఐదేళ్లుగా కార్మికులు, ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఈ కాలంలో వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం చేయని కుట్ర లేదు, తొక్కని అడ్డదారి లేదు. బిజెపి సర్కార్ కుతంత్రాలను గత వైసిపి ప్రభుత్వం గట్టిగా అడ్డుకోలేదు. తామొస్తే విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే ఉంచుతామని ఎన్నికల్లో టిడిపి-జనసేన హామీ ఇచ్చాయి. బిజెపితో కలిసి అధికార పీఠం ఎక్కాక పలాయన వాదం పఠించడం నమ్మక ద్రోహమే. మోడీ ప్రభుత్వం పార్లమెంట్ లోపల, వెలుపల ప్రైవేటీకరణ తథ్యమంటోంది. కార్మికుల తొలగింపు, విఆర్ఎస్, ఉత్పత్తిలో కోత, ఉత్పత్తి ఆధారిత జీతాలు ఇత్యాది చర్యలకు పాల్పడుతోంది. కార్మికుల వేతనాల్లో కోతలపై సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు కార్మికులను, వారి శ్రమను కించపరుస్తాయి. మోడీ ప్రభుత్వ ప్రైవేటీకరణ కుట్రలను బలపర్చేవిగా ఉన్నాయి. 32 మంది ఆత్మబలిదానం, ఎందరో త్యాగధనుల పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిరక్షణకు పార్టీలకతీతంగా కదిలి బిజెపి ప్రభుత్వ కుట్రలను ప్రతిఘటించాలి. ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ కానివ్వబోమన్న ఎన్నికల హామీకి టిడిపి-జనసేన కట్టుబడి మోడీ ప్రభుత్వం మెడలు వంచాలి. అప్పుడే ఆ పార్టీలను ప్రజలను విశ్వసిస్తారు.




Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215